# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

శనివారం, జనవరి 18, 2025 | సంపుటి - 20 | సంచిక 108 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



విలేకరులు కావలెను

అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందుతున్న ది క్రైమ్ న్యూస్ దిన పత్రికకు ఉమ్మడి జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకర్గాల వారిగా ఆర్‌సీ ఇంచార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు ప్రాధాన్యత ఇవ్వబడును

రాజకీయ అవగాహన కలిగిన కొత్త వారికి అవకాశం ఇవ్వబడును.

వివరాలకు సంప్రదించండి 6305584064


## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు

### అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్‌కు 14 ఏళ్ల జైలు శిక్ష



లాహోర్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు.



## స్కిల్ వర్సిటీకి టెక్నికల్ సహకారం

### సింగపూర్ యూనివర్సిటీతో ఎంఓయూ

### సిఎం రేవంత్ సమక్షంలో కీలక ఒప్పందం

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూని వర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయు కుదుర్చు కుంది.

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్‌ల సమక్షంలో యూని వర్సిటీ వైస్ ఛాన్స లర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ శుక్రవారం ఒప్పంద పత్రాలను మార్చు కున్నారు. సింగపూర్ ఐటీఈ పదో తరగతి చదివే విద్యా ర్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందు తున్నారు.

2లో



## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

### మినీ వ్యాన్, బస్సు ఢీకొని 9 మంది దుర్మరణం

పూణే : పూణే-నాసిక్ హైవేపై మినీ వ్యాన్, బస్సు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 మంది మర ణించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నారాయణగావ్‌లో ఈ ప్రమాదం జరిగింది.



## 31నుంచి బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరార య్యాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు నిర్వహించ నున్నారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి.



## పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

### కొత్త కార్డులను 26 నుంచి ఇవ్వబోతున్నాం

### విపక్షాల దుష్ప్రచారం నమ్మకండి

### మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

పాత రేషన్ కార్డులు తొలగిస్తారనే ప్రచారం అబద్ధమని, అలాంటివి నమ్మవద్దని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నెల26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

కరీంనగర్ : 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి జనవరి 26 నుండి కొత్త కార్డులు ప్రభుత్వం ఇస్తుందని, ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నా యని మండిపడ్డారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే.. సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని మంత్రి పొన్నం చెప్పారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

2లో

## ఆరు గ్యారెంటీలని.. అర గ్యారెంటీ అమలు

### సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కడిక్కడ నిలదీయండి

### బాకీలు అడిగినట్లుగా కాంగ్రెస్ నేతలను అడగండి

### చేవెళ్లలో ఉప ఎన్నిక రావడం ఖాయం

### హామీలను అమలు చేసేదాకా నిలదీస్తూనే ఉంటా

### షాబాద్ బిఆర్ఎస్ రైతు ధర్నా సభలో కెటిఆర్

కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు.

రంగారెడ్డి : 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా మన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతుబంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలని ఈ సందర్భంగా కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రుణ మాఫీ వంద శాతం పూర్తయిందని నిరూపిస్తే.. నేను, మా ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తాం' అంటూ సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేస్తున్నా రన్నారు. కేవలం ఫ్రీ బస్సుతో సరిపెట్టారని అన్నారు.

2లో



## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

### పారదర్శకంగా గ్రామసభల్లో లబ్దిదారుల ఎంపిక

### త్వరలో సర్వేయర్ల, గ్రామాధికారుల నియామకం


### రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



## దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

### జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టి

### మొబిలిటీ ఎక్స్‌పో 2025' ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ



దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు.

న్యూఢిల్లీ : దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు.మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు.

2లో

## కృష్ణాజలాలపై కెసిఆర్ పోరు ఫలించింది: కవిత



హైదరాబాద్ : బీడుబడ్డ తెలంగాణ భూములకు కృష్ణా జలాలను మళ్లించాలని ఉద్యమ నేత కెసిఆర్ చేసిన కృషి ఫలించిందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో వాటాపై ట్రిబ్యునల్ ఉత్తర్వులపై ఎంఎల్‌సి కవిత ఎక్స్ వేదికగా స్పందించారు. కృష్ణా నీళ్లలో మా వాటా మాకే అని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన పోరాట ఫలాలు అందుకోవడం ఎంతో దూరంలో లేదని వ్యాఖ్యా నించారు. రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరపాలని గత పదేళ్లుగా కెసిఆర్ చేసిన వాదనకే బ్రిజేష్

## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

### ఇది ముమ్మాటికీ నాటి కెసిఆర్ ప్రభుత్వ విజయం

### ప్రకటనలో వెల్లడించిన మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్ : కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్లు కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు.

2లో

## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

### బిజెపి సంకల్ప్ పాత్రపై కేజ్రీవాల్ విమర్శలు



న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పాత్ర-1'పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఇచ్చిన హామీలు 'ఆమ్ ఆద్మీ పార్టీ' నుంచి కాపీ కొట్టారని, తమ పార్టీ ఎంచుకున్న మార్గాన్నే వాళ్లు అనుసరించేటప్పుడు ఏమాత్రం విజన్ లేని బీజేపీని

# స్కిల్ వర్సిటీకి టెక్నికల్ సహకారం

మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగ స్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యుంగ్ ఇండియా స్కిల్స్ యూని వర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి తొలిరోజు పర్యటనలోనే ఈ కీలక ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటనలో తొలిరోజు విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. దీనిపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనుంది. కాగా.. ఉదయం సింగపూర్ విదేశాంగ మంత్రి వీవీఎన్ బాలకృష్ణతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ భేటీలో పాల్గొన్నారు.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు

ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రాబీబీ ప్రస్తుతం బయటే ఉన్నారు. అయితే తాజా తీర్పు సందర్భంగా ఆమె కోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది.

## దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు చర్యలు

ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల(ఇ÷ఎ)అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. 5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటుచేశామన్నారు. దిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్/మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టనుంది.

## విశాఖ ఉక్కు హామీని నిలబెట్టుకున్న కేంద్రం

**ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ**

**మీడియా సమావేశంలో వెల్లడించిన కేంద్రమంత్రులు**

న్యూఢిల్లీ : విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యావాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఇకపోతే ప్రైవేటీకరన అంటూ సాగిన ప్రచారానికి తెరపడింది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 'ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు..పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ఎ÷-లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు' అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు. దిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు. ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ఎ÷-లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ఎ÷-లాంటును సందర్శించారు. ఎ÷-లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు.

## పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు

'జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే పక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుంది. తెలంగాణ ప్రజలకు కొన్ని అంశాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నా. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పుడు పాత 90 లక్షల రేషన్ కార్డులు చర్చ కాదు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా, కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి శుభవార్త చెబుతున్నా. అర్హత ఉన్న వారికి జనవరి 26 నుండి రేషన్ కార్డులు ఈ ప్రభుత్వం ఇస్తుంది. ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయి. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వవచ్చని తెలిపారు. 'పాత రేషన్ కార్డులు తొలగించడం లేదు. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే నమ్మవద్దు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్ల సమాచారంతో కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయి. ఇందుర్తిలో 71 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయి. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం. భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నాం. ఇందుర్తి మండల ప్రతిపాదనలు పంపాం. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం పక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఆరు గ్యారెంటీలని..అర గ్యారెంటీ అమలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు రేవంత్ రూ.30 వేలు బాకీ పడ్డారని.. రూ.30 వేలు ఇస్తేనే ఓటేస్తామని మహిళలు నిలదీయాలని మాజీ మంత్రి అన్నారు. ఎన్నికలప్పుడు రూ.7600 కోట్లు రైతుబంధు వేసేందుకు తాము సిద్ధమైతే ఈసీకి లేఖ రాసి రైతు బంధును వేయనీయకుండా అడ్డుకున్నారన్నారు. యాసంగి పంట సమయంలో రైతుల కోసం రూ.7600 కోట్లు పెడితే.. రేవంత్ ప్రభుత్వం వచ్చాక నాట్లు వేసే సమయంలో కాకుండా.. పార్లమెంటు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రైతుల ఖాతాలో వేశారని విమర్శించారు. ఒక్కసారి మాత్రమే కేసీఆర్ ఇచ్చిన డబ్బులను రైతు భరోసా కింద వేశారని.. ఆ తరువాత రైతు భరోసా ముచ్చటే లేదన్నారు. ఖచ్చితంగా జనవరి 26న రైతులకు ఇస్తానన్న రైతు భరోసాను ఇవ్వాల్సిందే అని స్పష్టం చేశారు. అది కూడా రూ.12 వేలు కాదు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలను రైతుల ఖాతాలో జమ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వానాకాలం పంటకు ఎగ్గొట్టిన రైతు బంధును కూడా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓటేయమని అడిగితే.. ముందు బాకీ తీర్చాకే ఓటు వేస్తామని గట్టిగా చెప్పాలని రైతులకు చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.17500 బాకీ ఉంటే.. మహిళలకు సంవత్సరానికి రూ.30 వేల మేర రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి మోసగాడు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 37 రోజులు కాదు దమ్ముంటే 370 రోజులు జైల్లో పెట్టుకో.. భయపడేటోడు ఎవడూ లేడు అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకో. నిలబెట్టుకోకపోతే వెంటాడుతాం.. అడుగూతనే ఉంటాం. పేదల తరఫున కొట్లాడుతూనే ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. సర్పంచ్, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు వస్తారు.. చేయి గుర్తుకు ఓటేయండి అని అడుగుతారు. మీ సీఎం రైతుభరోసా కింద ఎకరానికి 17500 చొప్పున బాకీ ఉన్నాడు.. ఆ డబ్బులు చెల్లిస్తే ఓట్లు వేస్తామని చెప్పండి. బాకీ ఉన్నోన్ని అడిగినట్టు గల్లా పట్టుకుని అడగాలి.. అభయ హస్తం భస్మాసుర హస్తం అయిపోందని నిలదీయాలని ఆడబిడ్డలకు, రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు చిలుకకు చెప్పినట్టు చెప్పిండు కేసీఆర్. కాంగ్రెసోళ్లను నమ్మకండి అని చెప్పిండు. నెలకు 2500 పడ్డాయా..? 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా.? సర్పంచ్ ఎన్నికలప్పుడు వేస్తడు.. మళ్లీ నాలుగేండ్ల వరకు కనిపించడు. కాబట్టి రైతుబీమా, రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎక్కడ అని నిలదీయండని రైతులకు, ఆడబిడ్డలకు కేటీఆర్ సూచించారు. ఈ ఏడాది కాలంలో నాలుగైదు లక్షల లగ్గాలు అయ్యాయి. రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకతలేదా ..? బంగారం షాపుడో నిన్ను నమ్మడం లేదా..? పెళ్ళైన ఆడబిడ్డలకు 80 వేల చొప్పున బాకీ ఉన్నాడు. సిలిండర్ ఫ్రీగా వస్తలేదు. కరెంట్ 200 యూనిట్ల ఫ్రీగా ఇవ్వడం లేదు. పచ్చి మోసగాడు.. పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్.. 420 కేసు పెట్టాలంటే రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి. మనం కేసులు పెట్టినా.. పోలీసులు దరఖాస్తు తీసుకోవడం లేదు. రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది వాళ్లకు. అందుకే ఓట్లప్పుడే రేవంత్ రెడ్డికి చురుకు పెట్టాలని కేటీఆర్ చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక రాబోతుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసాలను రైతులు, ఆడబిడ్డలు ఎండగట్టాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌కు ఓటేయడంతో ఇక్కడున్న ఎమ్మెల్యే గెలిచిండు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సంకలో జొచ్చిండు. అభివృద్ధి కోసం పోయాను అని అంటుండు. ఈ ఏడాదిలో ఏం అభివృద్ధి జరిగింది..? రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా అమలైందా..? ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇచ్చావా..? ఏం అభివృద్ధి అయింది.. ఉన్నది పీకింది. ఎన్నికలు వచ్చినప్పుడు చేవేళ్లలోనే కాదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేల 10 నియోజకవర్గాల్లో బుద్ధి చెబుదాం. రైతు భరోసా వేయనందుకు, వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టినందుకు, రుణమాఫీ మోసం చేసినందుకు, ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వనందుకు, మా భూమి మాకే ఉండాలన్న పాపానికి 40 మంది రైతులను జైల్లో పెట్టి హింసించినందుకు.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం. చివరకు వృద్ధులను కూడా మోసం చేసిండు. ఆసరా పెన్షన్లు 4 వేలు ఇవ్వడం లేదు అని కేటీఆర్ ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి నోటికి హద్దు లేదు. మందికి పుట్టిన బిడ్డలను మా బిడ్డలు అని చెప్పుకుంటుండు. కేసీఆర్ ఇచ్చిన 44 వేల ఉద్యోగాలను నేను ఇచ్చిన అని చెప్పుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇవాళ షాబాద్‌లో జరిగిన ధర్నా మొట్టమొదటి.. మిగతా చోట్ల కూడా ధర్నా చేస్తాం. 70 లక్షల మంది రైతుల పక్షాన, 22 లక్షల మంది కౌలు రైతుల పక్షాన, భూమి లేని నిరుపేదల పక్షాన అడుగుతున్నాం.. ఇచ్చిన మాట నిలబెట్టుకో.. అందరికీ రైతుభరోసా జమ చేయ్.. లేదంటే రేపు పంచాయతీ ఎన్నికల్లో నీ వీపు చింతపండు చేస్తారు మా ఆడబిడ్డలు, రైతులు. ఇది ఆరంభం మాత్రమే.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతూనే ఉంటాం.. ఎన్ని కేసులు పెట్టినా.. జైళ్లకు పంపించినా రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు.ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, భారాస నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర పక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి ,రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ , హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్,జిహెచ్ ఎం సీ కమీషనర్ ఇలంబర్తి, సిఎంఆర్‌వో డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించు కోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రి సిఎస్ కి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం వీఆర్వో, వీఆర్ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## 31నుంచి బడ్జెట్ సమావేశాలు

ఈ నెల 31న పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

## మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

జున్నార్ గ్రామాల నుండి ప్రజలను తీసుకెళ్తున్న వ్యాన్ ప్రమాదానికి గురైంది. ట్రక్కు వెనుక భాగాన్ని ఢీకొట్టిన మినీ వ్యాన్ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ పూర్తిగా ధ్వంసమైంది. వ్యాన్ ప్రయాణికులతో నారాయణగావ్‌కు వెళుతోంది. బ్రేక్‌డౌన్ కారణంగా బస్సును హైవే పక్కన నిలిపివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణికులు లేరు.

### కృష్ణాజలాలపై కెసిఆర్ పోరు ఫలించింది: కవిత

కుమార్ ట్రిబ్యునల్ మొగ్గు చూపడం సంతోషకరమని అన్నారు. ఇది బిఆర్ఎస్ పార్టీ విజయం?తెలంగాణ ప్రజల విజయం అంటూ ట్వీట్ చేశారు.

## మా మేనిఫెస్టోను కాపీ కొట్టారు

ఎందుకు ఎన్నుకోవాలని ఆయన ప్రశ్నించారు. బీజేపీ 'సంకల్ప పాత్ర'ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, గ్యాస్ సిలెండర్లపై రూ.500 సబ్సిడీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ నిశిత విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ తరహాలోనే ఉచితాలు ఇస్తామంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈరోజు ప్రకటించారు. నేను ఒకటే అడుగుతున్నాను. ఉచితాలు మంచివి కావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఉచిత హామీలు గుప్పించడం ద్వారా గతంలో తాము చెప్పినది తప్పని, కేజ్రీవాల్ చేసింది సరైనదేనని ఒప్పుకున్నట్టు అయింది. ఉచితాలు హానికరం కాదని, దేశానికి భగవంతుని ప్రసాదమని మోదీ చెప్పాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని నడ్డా ఇప్పుడు చెబుతున్నారని, ఆ విషయాన్ని సంకల్ప్ పాత్రలోనూ చేర్చారని అన్నారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను మూసేస్తామని నడ్డా చెబుతుండటంపై తాను ఈరోజు ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి, మొహల్లా క్లినిక్‌కు కావాలా, వద్దా అని అడిగానని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లకు అనుకూలంగా ఉన్న వారు ఆప్‌కు ఓటు వేయాలని, వద్దనుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని అన్నారు. నా పని మరింత మెరుగ్గా ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. కేజ్రీవాల్ చేసే పనే మీరు చేస్తే మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలని ప్రజలు బీజేపీని అడుగుతున్నారు' అని ఆయన చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో క్లుప్లంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ చేసిన పనిని బీజేపీ అభినందించిందని చెప్పారు. బీజేపీకి ఒక ఎ÷-లానింగ్ అంటూ ఏదీ లేదని, ఆప్ మేనిఫెస్టోపై, ఆప్ హామీలపై పోటీ చేయాలనుకుంటోందని విమర్శించారు. ఇంతకంటే దరుదృష్టం మరొకటి ఉండదన్నారు. ఎలాంటి విజన్ కానీ, ఆలోచనలు కానీ ఎ÷-లానింగ్ కానీ లేని పార్టీని తన జీవితంలో ఎన్నడూ చూడలేదని బీజేపీపై కేజ్రీవాల్ విమర్శించారు.

## మంచు బ్రదర్స్ ట్వీట్ వార్

హైదరాబాద్ : మంచు బ్రదర్స్ మరోసారి మీడియాకెక్కారు. సోషల్ మీడియా వేదికగా ఒకరినొకరు తిట్టుకున్నారు. ముందుగా మంచు విష్ణు ఎక్స్(ట్విట్టర్)లో ఓ సినిమా డైలాగ్ ను ట్వీట్ చేశాడు. పరోక్షంగా తననే అన్నట్లు భావించిన మనోజ్.. వెంటనే ఎక్స్ లో మరో కౌంటర్ ట్వీట్ పడేశాడు. అసలు వీరిద్దరు ఎక్స్ వేదికగా ఏమని తిట్టుకున్నారో చూద్దాం..ముందుగా ట్వీట్ వార్ ను మంచు విష్ణు స్టార్ట్ చేశాడు. 'సింహం అవ్వాలని ప్రతి కుక్కకు ఉంటుంది.. కానీ వీధిలో మొరగటానికి, అడవిలో గర్జించడానికి ఉన్న తేడా కనీసం వచ్చే జన్మలోనైనా తెలుసుకుంటావు' అని తన తండ్రి 'రౌడీ' సినిమాలోని డైలాగ్ ను ట్వీట్ చేశాడు. సోషల్ మీడియా లో ఈ ట్వీట్ మంచు మనోజ్ ను ఉద్దేశించే విష్ణు చేశాడని చర్చ జరుగుతోంది. విష్ణు ట్వీట్ చేసిన కాసేపటికే మనోజ్ మరో ట్వీట్ చేయడం సోషల్ మీడయాలో హీట్ పెంచింది. 'కన్నప్పలో రెబల్ స్టార్ కృష్ణం రాజు గారి లాగా సింహం అవ్వాలని ప్రతి ఫ్రాడ్ కుక్కకి ఉంటుంది, ఈ విషయం నువ్వు ఇదే జన్మలో తెలుసుకుంటావ్' అని మనోజ్ కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశాడు.

# రెండు రోజుల్లో అర్హుల ఎంపికకు

# సర్వే పనులు పూర్తి చేయాలి

## • పెద్దపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి , జనవరి 17 ( ది క్రైమ్ న్యూస్ ):** ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల కార్యక్రమాలకు సంబంధించి అర్హుల జాబితా ఎంపికకు చేపట్టిన సర్వే పనులు రెండు రోజులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని బంధం పల్లిలో జరుగుతున్న రేషన్ కార్డ్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న కార్యక్రమాల అర్హుల ఎంపిక ప్రక్రియ సర్వే పెద్దపల్లి పట్టణంలో 2 రోజులలో పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం వార్డు సమావేశాలు నిర్వహించి రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల అర్హుల జాబితా వివరాలను ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో వ్యవసాయ యోగ్యం కాని భూములను మాత్రమే రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతి ఇంటికి వెల్లి కుటుంబ స్థితిగతులను



పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి దశలో అత్యంత పేదలకు అవకాశం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్ కుమార్, డిప్యూటీ తాహసిల్దార్ స్వప్న, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో భూసేకరణ పై యజమాన్యం దృష్టి

## - ఎస్టేట్ జీఎం నలజాల రాధాకృష్ణ

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** సింగరేణిలో పలు ఓపెన్ కాస్ట్ ల విస్తీర్ణకు భూసేకరణ చేయడంపై యాజమాన్యం దృష్టిసారించిందని శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ నుండి వచ్చిన ఎస్టేట్ జీఎం నలజాల రాధాకృష్ణ తెలిపారు. సెంటినరీ కాలనీ ఆర్జీ-త్రీ , గోదావరిఖనిలోని ఆర్జీ-వన్ జీఎంలు నరేంద్ర సుధాకర్ రావు, డి.లలిత్ కుమార్ లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. భూ సేకరణ పై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీ-త్రీ డివిజన్ ఓసీపీ-వన్ లో 330 హెక్టార్ల అటవీ శాఖ భూమి, ఓసీపీ-టు లో 88 ఎకరాల పట్టా భూమి ,జీడికే-5 వ ఓపెన్ కాస్ట్ లో 103 ఎకరాల భూమికి అవార్డు పాస్ చేయడం జరిగిందని తెలిపారు. ఆర్.జీ-వన్ సుందిల్లలో 265 ఎకరాల భూమి మైనింగ్ లీజ్ కింద ఉందని, కొందరు వ్యక్తులు వాటిలో పంటలు పండిస్తున్నారని, దీనిని త్వరలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మణుగూరు వీకే ఓపెన్ కాస్ట్ లో 928 హెక్టార్ల భూమి ఫేజ్-వన్ కింద క్లియరెన్స్ వచ్చిందని, ఫేజ్-టు కు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. మణుగూరు ఓపెన్ కాస్ట్ కు 58 ఎకరాల అటవీ శాఖ భూమి, 160 హెక్టార్ల పట్టా భూమి, జె.కె ఓపెన్ కాస్ట్ లో 152 నుండి హెక్టార్ల భూమి, గోలేటి ఓపెన్ కాస్ట్ కి 615 హెక్టార్ల భూమి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ కు 200 హెక్టార్ల భూమి, ఆర్.కే ఓసీపీకి ఫేజ్-



టు లో 365 హెక్టార్ల అటవీ శాఖ భూమి అవసరం ఉందని తెలిపారు. ఇతర ఓపెన్ కాస్ట్ లకు భూమి అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా సీ అండ్ ఎండీ నునావత్ బలరాం, డైరెక్టర్(పా) జి. వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భూసేకరణ వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్టేట్ ఆఫీసర్ కనేవెన.ఐలయ్య, అడిషనల్ మేనేజర్ సురేష్, డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్,జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఆకుల శ్యామల ఉన్నారు.

# కార్మిక, కర్షక ఐక్యత దినం జనవరి 19న జయప్రదం చేయండి

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని ముద్రించిన కరపత్రాలను ఈరోజు స్థానిక సిఐటియు ఆఫీసులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి అనేక కొత్త చట్టాలు తీసుకొస్తుందని, వీటిని వ్యతిరేకిస్తూ కిసాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు, ఉద్యమాలు జరుగుతున్నాయని, రైతు కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కేంద్రం ప్రభుత్వం నిర్ణయించాలని, 2022 లో జరిగిన రైతాంగ పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత 52 రోజులుగా ఢిల్లీ సరిహద్దుల్లో జగ్జీత్ సింగ్ దల్లేవాల్ అమరన




నిరాహార దీక్ష చేస్తున్నారని, మరో 150 మంది రైతు నాయకులు గత 3 రోజులుగా అమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారని, అయినా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ రైతాంగ పోరాటాన్ని విస్మరిస్తుందని అన్నారు. అందుకే జనవరి 19న కార్మిక కర్షక దినోత్సవం, జనవరి 26న ట్రాక్టర్ మోటార్ సైకిల్ ఫేరెడ్ నిర్వహించాలని, ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా జరిగే నిరసనలు జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను, విధానాలు ఉపసంహరించుకునే విధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంద రాజేందర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, నాయకులు సావణ పెల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు శుక్రవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 175 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 61 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 26 మంది ఉద్యోగులు హాజరై, 21 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం జి.రఘుపతి



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, సాయికృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, డి.పి.ఎం.గుర్రం శ్రీహరి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల లిస్టులో కొందరి పేర్లు మాత్రమే..?

## - పేదలందరికీ తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలి

## - మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నాగుల రాజశేఖర్ గౌడ్

**పెగడపల్లి, జనవరి,17 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల వద్దకు ప్రజా పాలన పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు గ్రామాలలో దరఖాస్తులు సేకరించిన విషయం తెలిసిందే, అందులో భాగంగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వటానికి ఇప్పుడు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది కానీ



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అధికారులు విడుదల చేసిన లిస్టులో కొందరి పేర్లు మాత్రమే రావటం జరిగింది అని గ్రామాలలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేయొద్దని పేదలందరికీ రేషన్ కార్డులు అందే విధంగా చూడాలని పెగడపల్లి మండల మాజీ ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు నాగుల రాజశేఖర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా పాలన లో దరఖాస్తు చేసుకున్న ప్రజానీకానికి అందరికీ తెల్ల రేషన్ కార్డు అందేలా చూడడం ప్రభుత్వం బాధ్యత కానీ గ్రామాల వారీగా అధికారులు విడుదల చేసిన లిస్టులో కొందరి పేర్లు మాత్రమే రావడం వలన నిజమైన నిరుపేదలకు రేషన్ కార్డు రాలేదని అన్నారు. అర్హులైన అన్ని కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు అందేలా ప్రస్తుత ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసి ఇప్పటికైనా అర్హులైన నిరుపేదలందరికీ తెల్ల రేషన్ కార్డు వచ్చేలా కృషి చేయాలని మాజీ ఉప సర్పంచ్ ల ఫోరం తరపున విజ్ఞప్తి చేశారు.

# గణపతికి గణపతి ఉపనిషత్‌లతో అభిషేకం



**ధర్మపురి, జనవరి 16, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహా స్వామి వారి ఆలయంలో గణపతికి గణపతి ఉపనిషత్ లతో అభిషేకం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా అనుభంద దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల గణపతికి గణపతి ఉపనిషత్ లతో అభిషేకం హారతి మంత్రపుష్పం కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించబడినదని ఆలయ ఇఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ సూపరింటెండెంట్ కిరణ్, అర్చకులు విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్, ద్యావళ్ల సాయికుమార్, స్థానిక వేదపండితులు మధు రామ శర్మ మరియు అదిక సంఖ్యలో భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్ వాల్ పోస్టర్ ఆవిష్కరించిన పట్నం మహేందర్ రెడ్డి



**కూకట్ పల్లి జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** కేపీహెచ్బీ కల్చర్, వెల్ఫేర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్" వాల్ పోస్టర్ ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.సంజీవరావు, మేకల మైఖేల్, కొండల్ రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, రేష్మ, నజీర్ బాయ్, కుమ్మ బాబూ,రాజుముదిరాజ్, శ్రీధర్‌చారి, గిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వారి వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## - ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:-** కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న తలపెట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సంస్థ రామగుండం రీజియన్-టు జనరల్ మేనేజర్ బి వెంకటయ్య కోరారు. ఆర్జి-టు ఏరియా వకిల్ పల్లి గనికి సంబంధించి జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోని రేమేడియేషన్ మేషర్స్ క్రింద వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంలో బాగంగా వకిల్ పల్లి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామమైన గ్రామ ప్రజలకు ఈనెల తేది:-18 శనివారం రోజున ఉ. 9 గం.ల నుండి పెంచికల్ పేట్ కమ్యూనిటీ హాల్ నందు ఆర్జి-టు ఏరియా సింగరేణి యాజమాన్యం ఆద్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని మరియు జూట్ బ్యాగుల శిక్షణను కూడా ప్రారంభించడం జరుగుతుందని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో నిష్ణాతులైన సింగరేణి వైద్యులచే వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగామందులుఇవ్వడం జరుగుతుందని డిజిఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి ఎస్.అనిల్ కుమార్తెలిపారు. కావున పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన ప్రజలు ఎక్కువ మంది హాజరై ఆర్జి-టు ఏరియా సింగరేణి సంస్థ కల్పిస్తున్న ఉచిత వైద్య శిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలనివారు తెలిపారు.

## సంపాదకీయం

# రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?

ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్ధమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగిం చుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జిఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది. మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జిఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.

# సవాళ్లతో చట్టాలను చులకన చేస్తారా ?



### అనుమతి లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారు

### దబాయింపు రాజకీయాలతో ప్రజలు వంచిస్తారా

### కెటిఆర్ సవాళ్ల రాజకీయాలపై సర్వత్రా విమర్శలు

హైదరాబాద్ : ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు.. లంబకోసం లేదు.. లొట్టపీసు కేసు అంటూ అహం కారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. గురువారం ఉదయం ఈడీ విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది.

# ఉమ్మడి ఎపి కోసం ఆనాడు గట్టిగానే పోరాడాం

### విభజన వల్ల నష్టపోయేది రాయలసీమ అని చెప్పాం

### మాజీ ఎంపి టిజి వెంకటేశ్ వెల్లడి

కర్నూలు : ఆంధ్రప్రదేశ్ సమైక్య రాష్ట్రంగా ఉండాలని పోరాటం మొదలు పెట్టింది తానేనని, రాయలసీమ ప్రాంతం వెనకబడిందని ఆధారాలతో సహా రాజకీయ పార్టీలకు ఇచ్చామని.. అప్పుడు ప్రణబ్ ముఖర్జీ మాకు పూర్తి మద్దతు తెలిపారని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. విడిపోతే నష్టపోయేది రాయలసీమేనని ఆనాడు గట్టిగా వాదించామని చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ విభజనకు అప్పటి సిఎంగా ఉన్న రోశయ్య మద్దతు తెలపలేదని చెప్పారు. ట్యాంకు బండ్‌పై విగ్రహాలు పగలకొడుతున్నప్పుడు శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం పగలగొట్టే ముందు మాపై దాడి చేయండని కోరానని.. వెంటనే ఆందోళన కారులు మమ్మల్ని గౌరవించి వెనక్కి వెళ్ళారన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు చేసే దిశగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చర్యలు మొదలు పెట్టాలని, విభజన హామీల అమలుకు తెలంగాణ పొలిటికల్ పార్టీలు కూడా సహకరిం చాలని టీజీ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఎపీలో కేంద్రం నిధులు ఇచ్చే ప్రాజెక్టులే వేగంగా ముందుకు వెళ్తున్నాయని, తెలుగు రాష్ట్రల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు ముఖ్యమైన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని టీజీ వెంకటేష్ సూచించారు. ఏపీ పారిశ్రామిక వేత్తలు తెలంగాణలో ట్యాక్సులు కడుతున్నారని, అందులో మనకు రావాల్సిన షేర్లు రావడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జితో ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర మంత్రి గడ్కరిని కోరానని, అందుకు గడ్కరి అంగీకారం తెలిపారన్నారు. కానీ గత ప్రభుత్వం అందుకు ప్రతిపాదనలు పంపక పోవడం వల్ల ఆ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని, గత ప్రభుత్వం అనుమతి లేకుండా పోతిరెడ్డిపాడు వద్ద రాయలసీమ ఎత్తి పోతల పథకం చేపట్టిందని, దీంతో ఆ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిందని, భారీగా ప్రజాధనం వృథా అయిందని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, రాయలసీమలో పారిశ్రామిక విప్లవం వస్తోందని, తన కుమారుడు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సీమలో ప్రాజెక్టుల స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ఆయకట్టు మొత్తానికి నీరు అందించేలా కాలువల పనులు చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు ఇంకా నిషాలో ఉన్నాయని, కేంద్రం పెద్దల నిర్ణయం మేరకే రాష్ట్ర నాయకత్వ మార్పు ఉంటుందని టీజీ వెంకటేష్ అన్నారు. బీజేపీ పెద్దలు.. మెగాస్టార్ చిరంజీవి స్నేహ పూర్వకంగా ముందుకు వెళ్తున్నారని, తదుపరి విషయాలు తనకు తెలియవని అన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం వల్ల కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలన అద్భుతంగా ఉందని కొనియాడారు. డోన్ టీడీపీ నాయకుడుపై దాడి చేసిన వారిని రెండు రోజుల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు మొదలవు తాయని, గత ప్రభుత్వంలో ఆలయాలపై ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కర్నూల్‌కు హైకోర్టు బెంచ్ గతంలోనే వచ్చేదని, కానీ కొంతమంది న్యాయవాదులు ఆందోళనలు చేయడం వల్ల ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తుందని టీజీ వెంకటేష్ అశాభావం వ్యక్తం చేశారు.

## 19తో ముగియనున్న ఉత్తర ద్వార దర్శనాలు

తిరుమల : కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రస్తుతం వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10 నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. దాదాపు పది రోజుల పాటు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించింది . దీంతో పెద్ద సంఖ్యలతో భక్తులు తిరుమల శ్రీవారిని వైకుంఠ ద్వారం గుండా ప్రవేశించి దర్శనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఏడురోజులుగా వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి. లక్షల్లో భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు చెబుతున్నారు. మరో మూడు రోజుల పాటు ఈ దర్శనాలు కొనసాగనున్నాయి. ఈనెల 19వ తేదీతో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియనున్నాయి. వైకుంఠ ద్వార దర్శనం నేపథ్యంలో తిరుమలలో అన్ని సేవలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి


### లాకెన్ రిలే చట్టాన్ని సవరించాల్సిందే

### అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ వెల్లడి

వాషింగ్టన్ : మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు. హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు.

# ఆశీర్వాద బలం!

తిరుమల : మన ఆచార వ్యవహారాల్లో శుభప్రద ఆకాంక్ష లకు, ఆశీర్వచనాలకు ఉన్నత స్థానం ఉంది. మనస్ఫూర్తిగా అందించే దీవెనలు ఫలిస్తాయి. నైర్మల్యంతో, త్రికరణశుద్ధిగా ఉచ్చరించే పదాలు మంత్రాలవుతాయి. క్రియలుగా మార్పు చెందుతాయి. విత్తనాలు నాటిన తర్వాత మంచి ఆలోచనలూ, నడవడికా ఉన్న వ్యక్తులు స్పృశించిన నీళ్లు చల్లితే అవి శీఘ్రగతిన మొలకెత్తాయని, మామూలు జలంతో పెరిగే మొక్కల కంటే ఏపుగా పెరుగుతా యంటారు పెద్దలు. ప్రతి దాంట్లో మనకు తెలియని విషయం ఏదో దాగి ఉందంటారు పెద్దలు. అది పంచభూతాలకూ వర్తిస్తుంది. మంత్రాలకు ప్రాథమిక ఆధారం ఇది. శుభభావనలతో కూడిన మంత్రం మన చుట్టూ గుణాత్మకమైన మార్పును కలగజేస్తుంది. గాయత్రీ తదితర మంత్రాల ఉచ్చారణతో ఒక ప్రత్యేక -ఎలక్ట్రో డైనమిక్ ఫీల్డ్ ఏర్పడుతుంది. ఎంత అధిక సంఖ్యలో మంత్రం పునశ్చరణ చేస్తే అంతగా ప్రభావం ఉంటుంది. విశ్వశాంతికి అదే మూలమవుతుంది.



ఆధ్యాత్మికం

# మాతా శిశు ఆస్పత్రిపై మంత్రికి నిర్లక్ష్యం ఎందుకో చెప్పాలే...

**- ఓట్లు వేసి మంత్రిగా చేసిన మంథని ప్రజల కష్టాలు తీర్చరా - రెండు నెలలుగా డాక్టర్‌ను నియమించలేని దుస్థితి సర్కారు - ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ పాలనే కన్పిస్తాంది - మెరుగైన వైద్యసేవలందించిన చరిత్ర బీఆర్ఎస్ సర్కార్‌ది - మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:-** ఆడబిడ్డల కాన్పు తల్లిదండ్రులకు భారం కాకూడదనే గొప్ప ఆలోచనతో ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాతా శిశు ఆస్పత్రి నిర్మాణం చేసి మెరుగైన సేవలు అందిస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ ఆస్పత్రిపై మంత్రి నిర్లక్ష్యం చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శుక్రవారం మంథని పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రిని ఆయన సందర్శించి ఆయా వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎంత మంది డాక్టర్లు ఉన్నారని, సిబ్బంది ఎంతమంది అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు మాసాలుగా గైనకాలిజిస్ట్ వైద్యుల నియామకం జరుగలేదని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిత్యం ముఖ్యమంత్రితో కలిసి తిరుగుతున్న మంథని ఎమ్మెల్యే తన సొంత నియోజకవర్గంలోని మాతా శిశు ఆస్పత్రిలో ఒక వైద్యుడిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకుడికి ఒక పెద్ద పదవి వస్తే ప్రజలు ఎంతో ఆనందిస్తారని, తమకు ఎంతోమేలు జరుగుతుందని ఆశిస్తారని, కానీ ఇక్కడ మాత్రం అందుకు బిన్నంగా జరుగుతోందన్నారు. మంథని ప్రజల ఓట్లతో గెలిచి మంత్రిగా అయిన మంథని ఎమ్మెల్యే మంథని ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని, రెండు నెలలుగా మాతా శిశు ఆస్పత్రిలో ఒక గైనకాలజిస్ట్ డాక్టర్‌ను నియమించడంలో విఫలం అయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. మంత్రి హెూదాలో ఉండి ఈ ప్రాంత ప్రజలను పురోగతిలోకి తీసుకెళ్లాల్సి ఉండగా అందుకు బిన్నంగా తిరోగమనంలోకి తీసుకెళ్తున్నారని ఆయన అన్నారు. మంథని ఎమ్మెల్యేను ఐదు సార్లు, ఆయన తండ్రిని మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంథని ప్రజలను ఓట్ల యంత్రాలుగానే చూస్తున్నారే తప్ప వారి గురించి ఏనాడు ఆలోచన చేయలేదని అన్నారు. రెండు నెలలుగా వైద్యుడిని నియమించకపోవడం ఎవరి తప్పో ఆలోచన చేయాలన్నారు. తాము ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వాటికి సరైన సమాధానం చెప్పకుండా కింది స్థాయి నాయకులతో తనను దూషించిపిస్తున్నారని, మాతా శిశు ఆస్పత్రి విషయంలో ఒక స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆనాడు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంథనిలో మాతా శిశు ఆస్పత్రిని మంజూరీ చేయించి నిర్మించామని, అటుతర్వాత వైద్యులను నియమించి ఈ ప్రాంత ఆడబిడ్డలకు కాన్పులు చేయించామని అన్నారు. సామాజిక వైద్యశాలలో ఆడబిడ్డలు కాన్పులై వేసవికాలంలో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతుంటూ తన ఆడబిడ్డల్లా బావించి ఏసీలు పెట్టించామని, అలాగే మాతా శిశు ఆస్పత్రిలో కూలర్లు అందించామని ఆయన గుర్తు చేశారు. ఈనాడు మంథని ఎమ్మెల్యే మంత్రిఅయ్యారని ఆస్పత్రికి మంచి రోజులు వచ్చాయని, మరిన్నిసౌకర్యాలు మెరుగుపడుతాయని భావిస్తే అందుకు బిన్నంగా ఆస్పత్రిని నిర్లక్ష్యంగా వదిలేశారని ఆయనవాపోయారు. ఒక వైద్యురాలు లేకపోవడంతో ఆస్పత్రిలో సుమారు 20మంది సిబ్బంది ఖాళీగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఎంతో మంది ఆస్పత్రికి వైద్యంకోసం వచ్చి డాక్టర్ లేక గోదావరిఖరి, కరీంనగర్ లాంటి పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంథనికి 30కిలో మీటర్ల దూరంలోనే కలెక్టర్ కార్యాలయం ఉందని, అయినా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. తరచూ ఈ ప్రాంతంలో పర్యటించే కలెక్టర్ మాతాశిశు ఆస్పత్రిలో వైద్యుల నియామకం ఎందుకు చేయడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే స్పందించి మాతా శిశు ఆస్పత్రిలో వెంటనే వైద్యురాలును నియమించి మెరుగైన సేవలుఅందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.








# ఉద్యోగం కోసం నగరానికి వచ్చి యువకుడు అదృశ్యం

**కూకట్ పల్లి జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి తిరిగి ఊరెళ్లే క్రమంలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి అందించిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా, నర్సాపూర్ మండలం, నర్సాపూర్ గ్రామం కి చెందిన ఒల్లెపు సాయన్న %బా/శీ% హనుమంత్, (19). ఈ నెల నాలుగవ తేదీన ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి మెరీనా స్కైస్‌లో సెక్యూరిటీ గార్డుగా 2 రోజులు పనిచేసి తిరిగి ఈ నెల 07 వ తేదీన తిరిగి ఊరు వెళ్లే క్రమంలో మద్యం తాగి ఇంటికి బయలుదేరి ఇప్పటివరకు చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కూకట్‌పల్లి పోలీసులను ఆశ్రయించి స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న కూకట్ పల్లి పోలీసులు ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతని వద్ద ఉన్న రెండు ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ ఉన్నాయని, ఈ వ్యక్తి ఆచూకీ ఎక్కడైనా లభిస్తే కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ మొబైల్ నంబర్: 8712663145, తల్లిదండ్రుల నం: 7989883565 లో తెలియజేయాలని ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.




# కార్యకర్తల సేవలను కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ మర్చిపోదు: బండి రమేష్



**కూకట్ పల్లి జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసే కార్యకర్తల సేవలను కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ మర్చిపోదని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు , స్వరూప గౌడ్ పుట్టినరోజు ను బాలానగర్ లోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా స్వరూప గౌడు ను శాలువాతో సత్కరించి, కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, కర్కే పెంటయ్య, కుక్కల రమేష్, యుగేందర్, నరేందర్, నాగార్జున, సునీల్ యాదవ్, రాజేందర్, అస్లాం, ఇతర నాయకులు పాల్గొని స్వరూప గౌడ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# అంగరంగ వైభవంగా అంగారక చతుర్థి వేడుకలు

**- గణనాథున్ని దర్శించుకుని పునీతుడైన భక్తులు**



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అలాగే సంవత్సరంలో ఒకసారి మాత్రమే వచ్చే అంగారక చతుర్థి శుక్రవారం రోజున రావడంతో గణనాథుని ఆలయాలు అన్ని భక్తులతో కిటకిటలాడాయి. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. కొత్తగా చతుర్థి చేసిన వారు అంగారక చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఒక ఆనవాయితీ. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం అనాదిగా పాటిస్తున్న నియమం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోజపులు ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. ఈ రోజున రాత్రి 10 గంటల 28 నిమిషములకు చంద్రోదయం అనంతరం స్వామివారి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయస్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో చెప్పబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# ఛలో మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవయాత్రను విజయవంతం చేయండి..

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె వి కృష్ణారావు...**

**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఛలో మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవయాత్ర ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కె.వి కృష్ణారావు పిలుపునిచ్చారు ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు ఈనెల 19న శనివారం మానుకోట పట్టణంలో అనంతారం నుండి అమరవీరుల స్తూపం వరకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవయాత్రకు తెలంగాణ ఉద్యమకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు . కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని మరియు గృహాన్ని నిర్మించుకునేందుకు 10 లక్ష రూపాయలు సహాయం చేస్తానని ప్రకటించిందని . 6 గ్యారంటీల పథకంలో 6వ గ్యారంటీగా ఈ అంశాన్ని పొందుపరిచిందని . మిగతా 5 గ్యారంటీల పథకాలను అమలు చేస్తూ ఆ అంశాలను పత్రికా ముఖంగా సమావేశల లో చెప్పడం జరుగుతుందని . 6వ గ్యారంటీ అయిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాత్రం ఎక్కడా కూడా ఏ ప్రజా ప్రతినిధి కూడా ప్రస్తావించడం లేదు ఎందుకని ? తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వానికి ఏమీ అన్యాయం చేశారని ప్రశ్నించారు . గత ప్రభుత్వం కూడా ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని . అప్పుడు ఉద్యమకారులందరూ తమ బలాన్ని గడిచిన ఎన్నికలలో గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని గద్దెదించారనే విషయాన్ని గుర్తు చేశారు . సోనియా గాంధీ మీద మాకు అపారమైన గౌరవం ఉందని ఇకనైనా సోనియా గాంధీ చొరవతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని మాకు నమ్మకం ఉందని . ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్, రాష్ట్ర కార్యదర్శి రాచమల్ల ఉమా యాదవ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా కన్వీనర్ రెడ్డబోయిన వరలక్ష్మి , లింగనబోయిన సతీష్, బట్టు రాజేంద్ర నాయక్, బెల్లంకొండ నాగేశ్వరావు, బాలిని భాస్కర్ రెడ్డి, కామని అనంతలక్ష్మి, స్వరూప రెడ్డి, ధనలక్ష్మి, జయ, పద్మ తదితరులు పాల్గొన్నారు .



# సమాజ సేవలో పద్మశాలి ఉద్యోగులు ముందుండాలి

## - అదనపు కలెక్టర్ అరుణశ్రీ



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:-** పెద్దపల్లి జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొలిపాక సారయ్య అధ్యక్షతన పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో, అడిషనల్ కలెక్టరు (స్థానిక సంస్థలు) జల్ద అరుణశ్రీ, పెద్దపల్లి ఆర్డిఓ, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు బొద్దుల గంగయ్య ల చేతుల మీదుగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపియూఎస్) క్యాలెండరు 2025 ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ, ఉద్యోగులు ఐక్యతగా ఉండి సేవాభావంతో పనిచేయాలని అన్నారు. సమాజ సేవలో పద్మశాలి ఉద్యోగులు ముందుండాలని, ఒకరికొకరు పరస్పరం సహకరించుకుని, అవసరాలకు సహాయంచేస్తూ, పేదలకు అండగా ఉండే కార్యక్రమాలు చేస్తూ అందరి మన్నలను పొందాలని పిలుపునిచ్చారు. మొదట అరుణశ్రీ ని కలిసిన సంఘ సభ్యులు కులదైవం మార్కండేయ ప్రతిమను జ్ఞాపికగా అందించి సంఘ కార్యక్రమాల గురించి వివరించారు. తదుపరి మార్కండేయుని ఫోటోకు పూలమాల వేసి, నమస్కరించి టిపియుయస్ క్యాలెండరును ఆవీష్కరణ చేసారు. ఈ కార్యక్రమములో పెద్దపల్లి జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొలిపాక సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం, సలహాదారులు డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందారపు నరేష్ లతో పాటు ప్రాథమిక సభ్యులు ఎనగందుల రాజప్రసాద్, చింతకింది రమేష్, శ్రీమతి స్వరూప రాణి, పల్లెర్ల కుమారస్వామి, ఆడెపు శ్రీనివాస్, ఒడ్నాల రజిత, బొమ్మ మమత తదీతరులు పాల్గొన్నారు.



# సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరం

## - చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావద్దు - కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత
## - రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** రామగుండం-త్రీ ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించిన 10 మందికి కారుణ్య నియామక ఉద్యోగాల ఉత్తర్వులను శుక్రవారం జి.ఎం. కార్యాలయంనందు నిర్వహించిన కార్యక్రమంలో రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్ ఉద్యోగంలో చేరుతున్నారని, అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా పని చేస్తూ, అధికారులు, సూపర్ వైజర్ల ఆదేశాలను పాటిస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహించాలని కోరారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరం లాంటిదని, చెడు అలవాట్లకు బానిసై విధులకు గైర్హాజరు కావద్దని, సీనియర్ ఉద్యోగుల దగ్గర క్రమశిక్షణతో పని నేర్చుకొని, కలిసి కట్టుగా పనిచేసి మున్ముందు మంచి పదోన్నతులు సాధించి కుటుంబం తో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్. వెంకటరమణ, ఎస్వోటుజిఎం గుంజపడుగు రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివైపిఎం వి.సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఎం పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

## - సిపిఎం మండల కార్యదర్శి కల్లెపల్లి అశోక్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సిపిఎం తెలంగాణ 4వ రాష్ట్రమహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం పెద్దపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ టీ షర్ట్స్ తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కల్లేపల్లి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి10 సంవత్సరలు గడిచిన ప్రజల సమస్యలు మాత్రం మారలేదని, ప్రభుత్వాలు మారినప్పటికీ ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కేంద్ర బీజేపీ ఆర్ ఎస్ ఎస్ ప్రజల మధ్య మతపరమైన కులపరమైన విభేదాలు పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుందని, నిత్యావసర సరుకుల ధరలు పెంచడం నిరుద్యోగ ఉపాధి సమస్యలతో సతమతం అవుతుంటే ,ప్రజల అసంతృప్తిని తమకు వ్యతిరేకంగా మారకుండా మతోన్మాదాన్ని కులోన్మాదన్నీ రెచ్చగొడుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు ఆదివాసులు మహిళలు మైనార్టీలపై దాడులు అధికంగా పెరుగుతున్నాయని, కేంద్ర బిజెపి ప్రభుత్వం, ప్రజా సమస్యలు పరిష్కార చర్యలు చేపట్టడం లేదని, బడాపెట్టుబడి దారులకు ప్రభుత్వ సంస్థలను అప్పనంగా కట్టుబెట్టే ప్రయత్నంలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీ లోఒకటి రెండు మినహా ఏది కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రాష్ట్రంలో కులదుహంకార హత్యలు పెరిగిపోయయని, కాంగ్రెస్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని, అన్ని వర్గాల ప్రజల్లో క్రమంగా ప్రభుత్వం పై అసంతృప్తి పెరుగుతున్నది. రైతులు కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని అలాగే భవిష్యత్తు మూడు సంవత్సరాల కాలానికి ప్రజల సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలను రూపొందించుకొని ప్రజల మధ్యకు ఈ మహాసభల ద్వారా వెళ్లడం జరుగుతుందని, ప్రజలు ప్రజాతంత్ర వాదులు లౌకికవాదులు మేధావులు ప్రతి ఒక్కరు సిపిఎం పార్టీకి చేదోడు వాదోడుగా నిలుస్తూ సిపిఎం పార్టీ మహాసభలకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఆనంతరం జిల్లా కమిటీ సభ్యులు సిపెల్లి రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయింది గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు అట్లాగే ఏ ఒక్కరికి కూడా ఇంటి స్థలంగాని నిర్మాణానికి ఐదు లక్షల కూడా చెల్లించలేదు ఒక ఫ్రీబస్సు తప్ప మిగతా హామీలు అవి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకపోతే సిపిఎం పార్టీగా తప్పకుండా మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని అట్లాగే తెలంగాణను ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య ఉచిత వైద్యం అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బూడిద గణేష్, మొదుంపల్లి శ్రావణ్, జిల్లాల ప్రశాంత్, కుమ్మరి నవీన్, వెంకటస్వామి, ఆదిత్య,తదితరులు పాల్గొన్నారు.

# స్వామిని దర్శించుకున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శోభారాణి



**ధర్మపురి, జనవరి 16, (ది క్రైమ్ న్యూస్):** మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బతికేపల్లి మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి శుక్రవారం ధర్మపురి శ్రీ లక్ష్మీనృసింహా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించారు. మొదటగాయమధర్మరాజును దర్శించుకున్న అనంతరం లక్ష్మి నృసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి, ఉగ్ర నరసింహ స్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు గోత్ర నామాధులతో అర్చన చేసి ఆశీర్వాదించారు. అనంతరం సంకష్ట చతుర్ధశిని పురస్కరించుకొని హేరంభ గణపతిని దర్శించుకుని పిదప శివాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఆశీర్వచన మండపంలో శోభారాణిని వేద పండితులు స్వామి వారి ప్రసాదం చిత్రపటం అందించి ఆశీర్వధించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన పిదప తమ ఇలావేల్పు ధర్మపురి లక్ష్మినరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, ఆ దేవుడి ఆశీస్సులు మా కుటుంబంపై ఏళ్లవేళలా ఉండాలని శోభారాణి కోరుకున్నానని ఆమె తెలిపారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి కృపా కటాక్షంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తూ మంచి పేరు వచ్చేలా చూడాలని మొక్కుకున్నామని శోభారాణి పేర్కొన్నారు. ఆమె వెంట కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ ఎన్నం కిషన్ రెడ్డి, స్వరాజ్యం, అంజలి తదితరులున్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడుపవద్దు

## - ప్రమాద రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి - రోడ్డు ప్రమాద మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ ఏసిపి జి నరసింహులు





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం వ్యాన్, ఆటో యజమానులకు, డ్రైవర్లకు ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 1వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం ట్రాఫిక్ ఏ. సి. పి జి.నరసింహులు పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను వివరించారు. వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వాహనం వెంట ఉంచుకోవాలని సూచించారు. హెల్మెట్ తప్పని సరిగా పెట్టుకోవాలని కోరారు. ప్రమాద రహిత పెద్దపల్లి గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి అనిల్ కుమార్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, వ్యాన్ ఆటో యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా సహాయ కార్యదర్శిగా రాంకుమార్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా సహాయ కార్యదర్శిగా మన్నె రాంకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా రాంకుమార్ మాట్లాడుతూ, పేద, బలహీన, అగ్రవర్ణ కుల పేదలకు నిస్వార్థ సేవలందిస్తానన్నారు. మానవహక్కుల ఉల్లంఘణ లేని సమాజం కోసం కృషి చేస్తానని ప్రకటించారు. అన్యాయం చేసేవారెవరైనా సరే వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల బాధ్యతతో పనిచేస్తానని పేర్కొన్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన నేషనల్ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ నందం నర్సింహులు, అడిషనల్ జనరల్ సెక్రటరీ మాదాసు చారేంద్ర, జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్ కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేటీఆర్ అబద్ధపు మాటలకి లై డిటెక్టర్లు పేలిపోయేలా ఉన్నాయి

## - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** ఈడీ, ఏసీబీ మొదటి విచారణలోనే కేటీఆర్ కళ్ళల్లో భయం కనపడిందని, కేటిఆర్ కు చిప్పకూడు తప్పదని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ముఖ్యమంత్రిని లై డిటెక్టర్ పరీక్షకి సిద్ధమా అని కేటీఆర్ సవాల్ విసరడం ఏమిటనీ, ఆ అర్హత కేటిఆర్ కు ఉందా ? అనే దాని పై శుక్రవారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, సంధ్య రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ లు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కేటిఆర్ ఈడీ ఆఫీస్ నుండి బయటకు వచ్చి మీసాలు తిప్పుతున్నాడు, ముఖ్యమంత్రిని లైవ్ డిటెక్టర్ టెస్ట్ చేయాలి అంటుండు, కేటీర్ వ్యాఖ్యలు చూస్తుంటే కామెడీ సీన్స్ గుర్తుకొస్తున్నాయనీ సత్యం శ్రీరంగం అన్నారు. కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్ళాడు పిటిషన్ విత్ డ్రా చేసుకున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలు విదేశాలకు పంపిస్తే తప్పు కదా? రేవంత్ రెడ్డి ని లై డిటెక్టర్ కు రమ్మనే అర్హత కేటిఆర్ కు లేదని, కేటీఆర్ లోపల ఎంత భయపడ్డావో అందరికి అర్థం అవుతుందని, అవినీతే లేదంటాడు, లొట్టపీసు కేసు అంటాడు, లొట్టపీసు కేసు అయితే కేటీఆర్ కు ఎందుకు అంత భయమని




ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పై 80 కేసులు ఉన్నాయని, కేటీఆర్ లాగా లొట్టపీసు కేసులు కాదనీ, ఏ రోజు కేటీఆర్ లా భయపడలేదనీ, దైర్యంగా ఎదుర్కున్నాడనీ, 55 కోట్లు దోచుకున్న దొంగ కేటీఆర్ అని, కేటీఆర్ కు విచారణ, జైలు కూడు తప్పదు అని అన్నారు. కేటిఆర్ మున్సిపల్ మంత్రి గా దోచుకున్నవన్ని కక్కిస్తామని, కేటీఆర్ 6 నెలలు చంచల్ గూడ జైలు లో ఉండటం ఖాయమని, తనకు ఏ దారి లేదనీ, జైలుకు పోవడమే తప్ప అని తెలిపారు. తప్పుచేస్తే చట్టం ఎవ్వరిని వదిలిపెట్టదని, ఎవరికైనా శిక్ష తప్పదని తెలిపారు. మీరు ముక్కు నేలకు రాసి, బట్టలు లేకుండా తిరిగినా, ప్రజలు మిమ్ముల్ని నమ్మరనీ కేటిఆర్ పై ఉన్న అన్ని కేసులు విచారిస్తే కేటిఆర్ 60 సంవత్సరాల వరకు బయటకు రాడనీ, అవినీతి పునాదుల మీద బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కట్టారనీ. అతి చిన్న బీఆర్ఎస్ పార్టీకి అన్ని కోట్ల పార్టీ ఫండ్ ఎక్కడిదనీ ఈ సందర్భంగా కేటీఆర్ ని ప్రశ్నించారు.

# దుష్ప్రచారం చేయాల్సిన అవసరం ఐఎన్టీయూసీకి లేదు

## - కార్మికులు చేసిన ఆరోపణలకు ఐఎఫ్టియూ నాయకత్వం సమాధానం చెప్పాలి
## - నిజ నిర్ధారణ కమిటీ వేయండి నిజాలు బయటికి వస్తాయి
## - ఐఎఫ్టియూ నాయకునికి ఐఎన్టియూసి సవాల్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** రామగిరి మండల కేంద్రంలోని శ్రీపాద భవన్ (ఐఎన్టియూసి) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిన్న ఐఎఫ్టియూ నాయకులు ఐఎన్టియూసి పై తమ అక్కసు వెలగక్కడం సరికాదని శుక్రవారం ఐఎన్టియూసి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ బండ కిరణ్ రెడ్డి అలాగే ఆర్.జి -త్రీ ఏరియా మహిళా ఇన్చార్జి రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.. ఐఎఫ్టియూ నాయకత్వంపై అబద్ధపు ప్రచారం చేస్తున్నామని, పైగా కేంద్ర నాయకత్వానికి సంబంధం లేకుండా చేస్తున్నామని పచ్చి అవాస్తవాలను మాట్లాడారు. ఐఎఫ్టియూ వెంకన్న పై ఆరోపణలు చేసింది ఐఎన్టియూసి కాదు. పార్కులలో పనిచేసే సామాన్య మహిళలు. ఎవరో చెప్తేనో, ఎవరో మాట్లాడితే ఆరోపణలు చేయలేదు. మీ నాయకుడు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు పెట్టించాడు కాబట్టి, ఆ ఉద్యోగంతో మోసపోయారు కాబట్టి కడుపు మండి మోసపోయి డబ్బులు రాక బాధతో మాత్రమే వాళ్లు మీడియా ముందుకు వచ్చి తమ బాధను వెలగక్కారు.



అది అర్థం చేసుకోలేని ఐఎఫ్టియూ నాయకత్వం గుడ్డిగా వెంకన్నను వెనకేసుకుని వచ్చి ఆరోపణలు చేస్తున్నది. ఐఎఫ్టియూ నాయకత్వానికి నిజంగా మహిళలకు న్యాయం చేయాలన్న ఉద్దేశం ఉంటే వెంటనే నిజనిర్ధారణ కమిటీ వేయండి. ఆర్ జి-త్రీ లో వెంకన్న కొనసాగిస్తున్న భాగోతాలపై విచారణ జరపండి. డబ్బులు తీసుకున్నట్లుగా పనులు చేస్తున్న మహిళలకు సమాధానం చెప్పండి. అంతేకానీ మీపై ఆరోపణలు చేయవలసిన అవసరం గాని అగత్యం గాని మా ఐఎన్టియూసి కి లేదు. ఇప్పటికైనా ఐఎన్టియుసి పై చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని, నీతిగా నిజాయితీగా నిబద్ధతతో కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలని ఐఎఫ్టియూ నాయకునికి తెలియపరుస్తున్నాం అదేవిధంగా ఇంతకుముందు చాలాసార్లు మా ఆర్జీ-త్రి ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఇన్చార్జి ఉడుత శంకర్ తెలియజేయడం జరిగింది. ఇకముందు ఇలాంటి అవాకులు చెవాకులు పెడితే వెంకన్న చేసిన మోసాలన్నీ ప్రజల ముందుకు తీసుకురావాల్సి ఉంటుంది జాగ్రత్త. ఈ కార్యక్రమంలో ఏ ఎల్ పి ఫిట్ సెక్రటరీ పాంచాల కృష్ణమూర్తి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్ది రాజ్ కుమార్,ఐఎన్టియూసి సీనియర్ నాయకులు పి.వి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు రైతుల కల సహకారం

## చేసిన నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు




ధర్మపురి, జనవరి 16, (ది క్రైమ్ న్యూస్): పసుపు రైతుల కల సహకారం చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి శుక్రవారం ధర్మపురి పట్టణ బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ పసుపు రైతుల కల సహకారం చేసి నిజామాబాదులో జాతీయ పసుపు బోర్డు ఇచ్చిన మన ప్రియతమ నాయకులు మన ప్రధాని నరేంద్ర మోడీ కి మరియు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కి ధర్మపురి బిజెపి పట్టణ శాఖ మరియు మండల శాఖ ధర్మపురి ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటాలకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ మాట్లాడుతూ గత ఆరు శతాబ్దాల కాలం నుంచి పసుపు రైతుల కల సహకారం చేసిన నరేంద్ర మోడీ కి ఎంపీ అరవింద్ కి మరోసారి ధన్యవాదాలు తెలుపుతూ భారతీయ జనతా పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిందంటే అది నెరవేర్చేదాక ప్రయత్నం చేస్తూనే ఉంటదని ఆయన పేర్కొన్నారు. మిగతా పార్టీలవలె హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని పబ్బం గడిపే పార్టీ భారతీయ జనతా పార్టీ కాదని ఈ సందర్భంగా భాస్కర్ తెలిపారు. ఈ పసుపు బోర్డు వలన గ్రామీణ రైతులందరూ ఆర్థికంగా బలోపేత ఔతారని ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే దేశంలో 20 రాష్ట్రాలలో పసుపు పండిస్తున్నారు కానీ పసుపు బోర్డు మన తెలంగాణలోనే ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోడీకి, నిజాంబాద్ ఎంపీ అరవింద్ కి ఋణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, మాజీ పట్టణ అధ్యక్షులు బెజ్జరపు లవన్ కుమార్, సీనియర్ నాయకులు నలుమాసు వైకుంఠం, పోగుల గుండన్న, తిరుమందా సత్యనారాయణ, కాశెట్టి హరీష్, సంఘీ మాధవ్ పిల్లర్ల సురేందర్ అప్ప మల్లేష్, కాశెట్టి శివ సాయి, విగ్నేష్, గోకుల్, వంశి, సృజన్, గానీ, జష్, శంకర్ పాకాల సాయి కిరణ్, ఉయ్యాల వెంకటేష్, పుప్పాల శ్రీనివాస్ పాకాల గణేష్, ఉయ్యాల నరేందర్, ఉయ్యాల శివ కృష్ణ, దుర్గం సుధాకర్ కోడిగంటి కిరణ్ రంగు శ్రీధర్ కెమెరా ప్రభాకర్ అబ్బూరి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి సహాయం చేయడం లక్ష్యంగా లయన్స్ క్లబ్

## - లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు




**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** రామగిరి మండలం వేంకట్రావుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ బుర్ర శశికళ ముత్యాలు గౌడ్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటీనరీకాలని వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరం ఉన్న వారిని ఎంపిక చేసి ఉచిత రవాణా సౌకర్యం కల్పించి రేకూర్తి హాస్పిటల్ తీసుకెళ్లడం జరిగింది. అనంతరం క్లబ్ అధ్యక్షుడు మొలుమురి శ్రీనివాస్,మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్ ధీటుగా కంటి ఆపరేషన్ రెకుర్తి హాస్పటల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుంది. భవిష్యత్తులో ఇంకా ఎంతో మంది పేదవారికి సహాయం చేయడం లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకు వెళ్తుందని తెలిపారు. మీ గ్రామంలో కూడా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలనుకుంటే లయన్స్ క్లబ్ ను సంప్రదించాలని కోరారు.ఇట్టి కార్యక్రమానికి సహకరించిన రేకుర్తి హాస్పిటల్ చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ సిదుర సురేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మేకల మారుతి యాదవ్, పరంకుసం శ్రీనివాస్ చారి గ్రామస్తులు పాల్గొన్నారు.

# సేవే పరమావధిగా మీ ముందుకు వస్తున్న...

## - పట్టభద్రుల ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు





**కరీంనగర్ టౌన్, జనవరి17(ది క్రైమ్ న్యూస్):** పట్టభద్రుల ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు సిద్దిపేట, సిరిసిల్లలోని శ్రీ చైతన్య నారాయణ విద్యాసంస్థల్లో యాజమాన్యాలతో సమావేశమై మద్దతు కోరడం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా సేవా కార్యక్రమంలో ఒక్క సేవకుడుగ ఉన్నానని ఎమ్మెల్సీగా కాదు ఒక సేవకుడిగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి శాసనమండలికి పంపితే పట్టభద్రుల గొంతుకనై ప్రశ్నిస్తానని అన్నారు.కోట్లు సంపాదించి ఆ సంపాదనను దాచిపెట్టుకో నీకు లేదా కోట్ల సంపాదన ధ్యేయంగా రావడంలేదని సేవా దృక్పథంతోనే మీ ముందుకు వస్తున్నానని మీ సేవకుడిగా నన్ను శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ట్రస్మా అధ్యక్షులు గోపాలపురం సుభాష్ ,ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, సిరిసిల్ల ట్రస్మా పట్టణ అధ్యక్షులు శబరి శ్రీనివాస్ ,ఆనంతుల శ్రీనివాస్ ,పండుగ రమేష్ ట్రస్మా బాద్యులు పాల్గొన్నారు.

# సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మహమ్మద్ రఫీ...

**హుజురాబాద్ జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ గా మహమ్మద్ రషీద్ పదోన్నతి పొందారు. రషీద్ హనుమకొండ జిల్లాలో రెండు సంవత్సరాలు పనిచేసిన అనంతరం డిప్యూటేషన్ పై హుజురాబాద్‌లో సెరికల్చర్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా జూలై 2024 నుండి జిల్లాలో ఒకే ఒక అధికారిగా పట్టు సాగు చేస్తున్న రైతులకు సలహాలు సూచనలు అందిస్తూ పట్టు పరిశ్రమ



అభివృద్ధికి కృషి చేశాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న పాపయ్యపల్లి రంగాపూర్ గ్రామాలకు ప్రత్యేక అధికారిగా పనిచేశారు. శాఖా పరమైన అర్హతలు ఉన్నందున రషీద్ ను సహాయపట్టు పరిశ్రమ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్ భాష ఉత్తరులు జారీ చేశారు.

# ఆర్ ఆర్ బి , ఎస్ ఎస్ సి , బ్యాంకింగ్ పరీక్ష కోసం 100 రోజుల ఉచిత శిక్షణ

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి.17(ది క్రైమ్ న్యూస్):** ఆర్ ఆర్ బి, ఎస్ ఎస్ సి, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ యం పి వి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000/- కు మించకూడదని ఆయన పేర్కొన్నారు. ఎంపిక విధానం ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా అలాగే రిజర్వేషన్ నియమం ప్రకారం ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత గల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుండి 14 వరకు ఉంటుందని, ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# రేవంత్ రెడ్డి ఓ అబద్ధాలకోరు ....

## - బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు



**జమ్మికుంట జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ అబద్ధాల కోరు అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు ఆరోపించారు. 6 గ్యారెంటీల పేరిట 420 హామీలు ఇచ్చి తెలంగాణలో ఆదికారిలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను మోసం చేశాడని సంపత్ రావు తీవ్రంగా దుయ్యబట్టాడు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో నిన్న రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు అనేక రకాల అమలు కానీ హామీలు ఇచ్చి వాటి అమలు బాధ్యత తనదేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు ఏ రకంగా గ్యారంటీ ఇస్తాడని సంపత్ రావు ప్రశ్నించాడు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలు ఢిల్లీ ప్రజలకు తెలుసని, రేవంత్ రెడ్డి హామీలను నమ్మే పరిస్థితిలో ఢిల్లీ ప్రజలు లేరని సంపత్ రావు అన్నారు. గతంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను లిక్కర్ కుంభకోణంలో అరెస్టు చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ అతనికి అండగా నిలబడి, రాజకీయ కక్షలో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కేజ్రీవాల్ ను అక్రమంగా అరెస్ట్ చేశారని గగ్గోలు పెట్టిన రేవంత్ రెడ్డి,(కాంగ్రెస్ పార్టీ) నిన్న ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి మరి లిక్కర్ స్కాం సూత్రధారి కేజ్రీవాల్ అని చెప్పడం జరిగిందని సంపత్ రావు గుర్తు చేశాడు. ఇప్పటికైనా కేజ్రీవాల్ విషయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి నిజం తెలుసుకున్నందుకు సంతోషమన్నారు. ఓట్లు, సీట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుంది అనడానికి నిన్న రేవంత్ రెడ్డి ఢిల్లీలో మాట్లాడిన మాటలు నిదర్శనమని సంపత్ రావు ఆరోపించారు. మొన్న జరిగిన మహారాష్ట్ర,హరియన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి అక్కడి ప్రజలకు అనేక రకాల హామీలు ఇచ్చారని, కానీ అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టారని సంపత్ రావు గుర్తు చేశాడు. రేపు జరగబోయే ఎన్నికల్లో కూడా ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని సంపత్ రావు అన్నారు. ఢిల్లీలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని సంపత్ రావు జోస్యం చెప్పారు.

# గ్రామీణ ప్రాంతాల్లో బీద ప్రజలకు వైద్య సేవలు అందించాలి

## - పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు తక్కువ ధరలో వైద్య సేవలు అందించాలి అని పెద్దపెల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కోరారు. శుక్రవారం కమాన్ పూర్ మండల కేంద్రంలో కరీంనగర్ పట్టణానికి చెందిన డాక్టర్ కొమ్ము కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకే న్యూరో, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి యొక్క క్యాలెండర్ ను శుక్రవారం కమాన్ పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో బీద ప్రజలు ఉన్నారని వారికి వైద్య సేవలు అందించి ఆదుకోవాలని అన్నారు. బీదవారికి సేవ చేయడం పుణ్య కార్యక్రమము అని అన్నారు. అలాగే కరీంనగర్ పట్టణంలోని డాక్టర్ కొమ్ము కిరణ్ సైతం పేదవారికి సేవలు చేస్తున్నారని ఆయన గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన ఆయన పేద ప్రజల బాధ తెలుస్తుందని అందుకొరకే ఆయన పేదలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, జూలపల్లి మాజీ ఎంపీటీసీలు, బొల్లంపల్లి తిరుపతి గౌడ్, సేవ్వ శంకరయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిలారం మల్లయ్య, మండల బిజెపి అధ్యక్షుడు కొయ్యడ సతీష్, జంగేపల్లి అజయ్, అన్నవేళ లక్ష్మీరాజం, ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్ట నరసయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దాసరి రామస్వామి, అంబటి కనకయ్య, గుండారం గ్రామ కార్యదర్శి బచ్చల భాస్కర్, ఇనగంటి ప్రభాకర్ రావు, గుర్రాల చంద్రమౌళి, రాజమల్లు , కో లేటి రమేష్, పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# పత్రికల్లో నిర్భయంగా వార్తలను రాయాలి

## - తాసిల్దార్ వాసంతి ఎంపీడీవో లలిత



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** పత్రికల్లో వార్తలను నిజాలను నిర్భయంగా వ్రాయాలని కమాన్ పూర్ తహసిల్దార్ వాసంతి ఎంపీడీవో జీ లలిత అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో ప్రజా క్రాంతి దినపత్రిక క్యాలెండర్ను తాసిల్దార్ వాసంతి ఎంపీడీవో జీ లలితలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో పత్రికలకు ఎంతో విలువ ఉందని ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ఎన్నో వార్తా ప్రసారాలను చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే వార్తలు రాయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, జూలపల్లి మాజీ ఎంపీటీసీలు, బొల్లంపల్లి తిరుపతి గౌడ్, సేవ్వ శంకరయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిలారం మల్లయ్య, మండల బిజెపి అధ్యక్షుడు కొయ్యడ సతీష్, జంగేపల్లి అజయ్, అన్నవేళ లక్ష్మీరాజం, ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్ట నరసయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దాసరి రామస్వామి, అంబటి కనకయ్య, గుండారం గ్రామ కార్యదర్శి బచ్చల భాస్కర్, ఇనగంటి ప్రభాకర్ రావు, గుర్రాల చంద్రమౌళి, రాజమల్లు, కో లేటి రమేష్, పాత్రికేయుడు జబ్బార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు

## - రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** తమపై ఎలాంటి పోలీస్ కేసులు లేవని క్లియరెన్స్ నిమిత్తం కొంతమంది తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించడం జరుగుతుందని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేయడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని వారు పాస్ పోర్ట్ కోసం, ఉద్యోగ నియామకాల కోసం, బయట దేశాలకు వెళ్లడం కోసం, తదితర కంపెనీ, సంస్థలు, పరిశ్రమలలో పనిచేయడం కోసం పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్ (పివిసి), పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ (పిసిసి) కోసం దరఖాస్తులు చేసుకొనే వారు కొంతమంది వారిపై గతంలో కేసులు నమోదు కాబడిన కూడా తమపై ఎలాంటి కేసులు లేవని, పోలీస్ కేసుల క్లియరెన్స్ నిమిత్తం తప్పుడు అఫిడవిట్‌లు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రామగుండం కమీషనరేట్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది వారి దరఖాస్తు ఆధారంగా విచారణ చేసినప్పుడు కొంత మందిపై కేసులు నమోదు కాబడ్డాయని గుర్తించడం జరిగిందని, గతంలో కూడా తప్పుడు అఫిడవిట్ ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని, ఇప్పుడు తప్పుడు అఫిడవిట్‌లు ఇచ్చిన సుమారు 20 మందిని స్పెషల్ బ్రాంచ్ వారు గుర్తించడం జరిగిందని, వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికేట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరు తప్పుడు అఫిడవిట్ సమర్పించినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ హెచ్చరించారు. అఫిడవిట్ నోటరీ చేసే వాళ్ళు కూడా మీ దగ్గరకు అఫిడవిట్ కోసం వచ్చే వాళ్లకు కూడా తప్పుడు సమాచారంతో అఫిడవిట్ సమర్పిస్తే విచారణలో పోలీసు వారు గుర్తించడం ద్వారా కేసులు నమోదు చేయబడుతాయని తెలియజేయాలని సూచించారు.

# స్పీడ్ బ్రేకర్లు రైలింగ్ ఏర్పాటు చేయండి

## - ఎన్ ఎచ్ ఆర్ సి ఎన్జి.ఓ పెద్దపల్లి జిల్లా చైర్మన్ మాచిడి దిలీప్



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)జనవరి 17:** మంథని పట్టణానికి చెందిన మాచిడి దిలీప్ శుక్రవారం రోజున మంథని పట్టణంలో పలు ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు, రైలింగ్ లు ఏర్పాటు చేయాలని మంథని మున్సిపల్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. మంథని లోని బోక్కల వాగు కట్ట పై ప్రతి రోజు ఉదయం సాయంత్రం సమయంలో వాకింగ్ చేయడానికి పాదచారులు చాలా మంది వస్తుంటారు. అదే సమయంలో కొంత మంది వాహనాలు వేగంగా వెళ్లడంతో యాక్సిడెంట్స్ జరిగి హాస్పిటల్ పాలై అప్పులపాలవుతున్నారు. మరి కొంత మంది తమ జీవితాలను కోల్పోతున్నారు. బ్రిడ్జిపై 16 గురువారం యాక్సిడెంట్లో ఓ తల్లి ప్రాణాలు కోల్పోవడం చాలా బాధ కలిగించింది. గతంలో కూడా బొక్కల వాగు పై నుంచి వాహన చోదకులు వాగులో పడినా సంఘటనలు కూడా ఉన్నాయి. మంథని 12వ వార్డు సుభాష్ నగర్ బొక్కల వాగు కట్ట పైన ఉన్న రోడ్డు, బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు, రెయిలింగ్ ఏర్పాటు చేసి కొంతలో కొంతైనా ఈ ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

# ప్రజా గాయకుడు దివంగత గద్దర్ విగ్రహం ఏర్పాటు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జనవరి 31న కరీంనగర్ జిల్లా కేంద్రం తెలంగాణ చౌక్ లో ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమకారులు దివంగత గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు గద్దర్ గళం రాష్ట్ర ఉపాధ్యక్షులు, గద్దర్ విగ్రహ కమిటీ చైర్మన్ గజ్జల స్వామి తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో శుక్రవారం కళాకారులు, రచయితలు, అభిమానులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజా యుద్ధ నౌకగా పేరొంది, అనునిత్యం తన ఆట, పాటల ద్వారా ప్రజల పక్షాన పోరాడిన గద్దర్ ను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. గద్దర్ విగ్రహ ఆవిష్కరణకార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వివిధ అంశాలపై సదస్సులో చర్చించారు. ముఖ్య సలహాదారు కొరి వేణుగోపాల్, న్యాయవాది పూరేళ్ళ రాములు, విగ్రహ కమిటీ కన్వీనర్ మేడి అంజన్న, కో కన్వీనర్లు మసాల స్వామన్న, తగరం శంకర్ లాల్, జాదవ్, పెరుక రాజన్న, పెద్దపల్లి నియోజకవర్గం ఇంచార్జి బొల్లం మల్లేశం, కో ఇంచార్జి ఏట రవి, అసం తిరుపతి, గుల్ల రాజు, తదితులు పాల్గొన్నారు.

# దైద హర్షిత్‌కు నేషనల్ అవార్డ్...

## - దైద హర్షిత్‌ను ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటాలి

## - మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భుక్య మురళినాయక్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 17, (ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనికి చెందిన దైద హర్షిత్ కు బెస్ట్ పర్యావరణ ప్రేమికుడిగా నేషనల్ అవార్డు ను జనవరి 11 న హైద్రాబాద్ లో తీసుకున్న సందర్భంగా 24 వార్డు లో కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భుక్య మురళినాయక్ హర్షిత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పర్యావరణ పరిరక్షణ కోసం చిన్న వయసు నుంచే మొక్కలు పంపిణి చేసి మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తున్న హర్షిత్ సేవలు అభినందనియమని ప్రతి ఒక్కరూ దైద హర్షిత్‌ను ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగసామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మదరబోయిన యాకన్న.ఇంద్ర రెడ్డి. దీలిప్. పద్మం ప్రవీణ్.ఆకుల రాజు తదితరుల పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

## - తబిత సంరక్షణ కేంద్రం పిల్లలతో భేటీ అయిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రామగుండంలోని తబిత సంరక్షణ కేంద్రం పిల్లలు వచ్చి కలిసారు. తబిత ఆశ్రమంలో చదువుతున్న 10 మంది విద్యార్థులను గుర్తించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వారికి భూపాల్ పల్లి జిల్లా కాటారం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించారు. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఆశ్రమానికి వచ్చిన పిల్లలు జిల్లా కలెక్టర్ ను కలిసి తమ బాగా చదువు కుంటున్నామని, జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మనకు జీవితంలో అనేక కష్టాలు, బాధలు వస్తాయని, వాటిని అధిగమించి ధైర్యంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ పిల్లలకు సూచించారు. ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయాలని, కొంత సమయం క్రీడలకు కేటాయించాలని, ఉల్లాస వాతావరణంలో చదువుకోవాలని, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గురుకులాల్లో సీట్ ఇప్పించిన జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ కు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ కు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్,జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేస్తే నేరాలు నియంత్రించవచ్చు

## - బ్యాంకులు, ఏటిఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

## - ఏటిఎంల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలి

## - రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీస్ అధికారులతో సమన్వయంతో పని చేస్తే నేరాలను నియంత్రించవచ్చని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల వ్యాప్తంగా ఉన్న ఎసిపిలు, వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు అధికారులతో బ్యాంకులు, ఎటిఎంల వద్ద భద్రతా ప్రమాణాలు, సిసి కెమెరాల ఏర్పాటు, ఆర్థిక నేరాలు, గతంలో రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరిగిన బ్యాంక్, ఎటిఎం సంబంధించిన నేరాల గురించి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఎటిఎం సెంటర్స్, మంచిర్యాల జోన్ పరిధిలో 109 బ్యాంకులు, 89 ఎటిఎం సెంటర్స్‌లను గుర్తించడం జరిందని అన్నారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని, ఎటిఎం కేంద్రాల వద్ద కచ్చితంగా గార్డును నియమించాలని సిపి ఆదేశించారు. నిరంతరం సెక్యూరిటీ గార్డు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రామగుండం కమీషనరేట్ పోలీసులు నిర్వహించిన ఆడిట్‌లో దాదాపు బ్యాంకులు, ఎటిఎంలలో అధిక నాణ్యత లేని సీసీ కెమెరాలు ఉన్నాయని, చాలా బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరని ఈ సమావేశం అనంతరం అన్ని ఎటిఎంలలో, బ్యాంకులలో అలారం సిస్టమ్‌లతోపాటు సిసి టివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీని నియమించాలని, దోపిడీ సమయంలో సిబ్బంది ఎలా ప్రతి స్పందించాలో దానిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. లోపలికి వచ్చే వ్యక్తులను తనిఖీ చేయడానికి డ్యూటీలో ఉన్న గార్డుకు బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద ఒక డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్‌ను ఏర్పాటు చేసి, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ అందించాలని సూచించారు. సెక్యూరిటీ గార్డును బ్యాంక్ లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, అతని వ్యక్తిగత సమాచారం యొక్క పూర్తి రికార్డు, అతని ఫోటోతోపాటు, బ్యాంక్ వద్ద ఉంచాలని అన్నారు. కొత్తగా నియమితుల్కైన వారు లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన వారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, చాలా నేరాలలో నిందితులు సీసీ టీవీలపై స్ప్రే చేసి సిసి టివిలు పని చేకుండా చేసి దొంగతనాలకు పాల్పడుతారని, అదేవిధంగా డివిఆర్‌లను దొంగిలించి నాశనం చేయడం చేస్తారని, డివిఆర్‌లను కనిపించేలాగా కాకుండా సీక్రెట్ ప్రాంతాలలో దాచాలని సూచించారు. అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్‌లో భాగమైన నిజమైన కస్టమర్‌లు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి ఆయుధాలు ఉపయోగంపై సెక్యూరిటీ గార్డులకు శిక్షణ ఇవ్వాలని,సెక్యూరిటీ గార్డ్, బ్యాంకు లోపల, బయట పరిసరాలను, వ్యక్తులను, వారి కదలికలు, ప్రవర్తనలను గమనిస్తూ ఉండాలని



బ్యాంక్ అధికారులను కూడా ఆదేశించారు. ఎటిఎంలలో డబ్బుల ఫీల్లింగ్ సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలోని బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి బ్యాంకు అధికారికి, సిబ్బందికి బ్యాంకు ఉన్న ప్రాంత పోలీస్ స్టేషన్ అధికారుల నెంబర్‌లు తెలిసి ఉండాలని, హెల్ప్‌లైన్, పోలీస్ స్టేషన్‌ల సంప్రదింపు నంబర్‌లను బోల్డ్ అక్షరాలతో వ్రాసి బ్యాంకు లోపల తగిన ప్రదేశాలలో ఉంచాలని, తద్వారా అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు అవి సులభంగా కనిపిస్తాయని తెలిపారు. ఇప్పటి వరకు దొంగలు ఎక్కువగా బ్యాంకులను రోజుకి తెరిచినప్పుడు లేదా మూసివేయబడిన సమయంలో లేదా వారి భోజన విరామ సమయంలో కూడా లక్ష్యంగా చేసుకున్నారని, ఈ సమయంలో సెక్యూరిటీ గార్డుతోపాటు బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదకరమైన సంఘటన జరిగినప్పుడు డయల్ 100కు, స్థానిక పోలీస్‌లకి సమాచారం ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, కమిషనరేట్ పరిధిలోని ఎసిపిలు, ఎఆర్ ఎసిపిలు ప్రతాప్, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ సతీష్, ఐటి అండ్ కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఆర్ఐ దామోదర్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమలుగాని హామీలు ఇచ్చేముందు తెలువదా రాష్ట్రానికి అప్పైందని.....?

## - మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశానికి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హాజరై మాట్లాడుతూ...... కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరు గ్యారంటీలతో పాటు 420హామీలకు ఎంత డబ్బు కావాలో ప్రభుత్వానికి అవగాహన ఉందా అని ప్రశ్నించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అదనంగా 80 వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని ఫోర్త్ సిటీకి 30 వేల ఎకరాలు కావాలని, పథకాలు అమలు చేయమంటే గత ప్రభుత్వం అప్పులు చేసిందని కుంటి సాకులు చెబుతున్నారని, హామీలు ఇచ్చేటప్పుడు తెలంగాణ రాష్ట్ర అప్పుల సంగతి తెలువదా అని మండిపడ్డారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ప్రతిపక్ష నాయకులు మాట్లాడితే ఏ ఒక్క దానికి సమాధానం చెప్పకుండా అనుభవ రాహిత్యం, అవగాహనలేకుండా అహంకారంతో మాట్లాడుతున్నారని, ప్రజలను నమ్మిస్తూ కాలం గడపడానికి వాస్తవాలను రూపుమాపేందుకు ఎత్తుకడలు వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి తెలివిని ప్రదర్శిస్తున్నాడని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ 2005నుండి తెలంగాణ ఏర్పాటు వరకు ప్రజా అవసరాలపై పోరాడి తెలంగాణ వచ్చిన తరువాత వాటిని అమలు చేసిన పరిస్థితులను ప్రజలకు గుర్తుచేస్తున్నానన్నారు. ప్రస్తుతం తెలంగాణ దేశంలోనే రెండవ స్థానం ఉందని ఉద్యమ సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యను పట్టించుకోలేదని, పార్లమెంటు పాస్ చేసిన బిల్లులు ఏ ఒక్కటైనా అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఒక్క ఓటు రెండు రాష్ట్రాలని చెప్పి ఓట్లు దండుకున్న విషయం జనాలకు తెలువదు అనుకునే దుస్థితి ఏ రాజకీయ పార్టీలకు రాకూడదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే రాష్ట్రనికి అప్పైందని సాకులు చెబుతున్నారని అసలు అప్పు ఎందుకు చేస్తారో ముఖ్యమంత్రికి తెలుసా అని మండిపడ్డారు.ఏ ప్రభుత్వమైనా అభివృద్ధి కోసమే అప్పు చేస్తుందని బిఆర్ఎస్ ఏం అభివృద్ధి చేయకపోతే దేశంలో ఏ రాష్ట్రంలో పెరగని విధంగా సగటు వ్యక్తి యొక్క ఆదాయం 3వంతులు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రపంచ దేశాల్లో సైతం ఒకటికి రెండింతలు అప్పు అవుతంది.కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పు కనపడుతుంది కానీ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి కనబడడం లేదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై పై మండిపడ్డారు. కెసిఆర్ పై విమర్శలు మాని అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని హితువు పలికారు. కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్ రావు,బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్,మాజీ జెడ్పీటీసీ తాళ్ళపల్లి శేఖర్ గౌడ్, నాయకులు శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్,పిట్టల మధు,నెల్లి మురళి, అభిలాష్,ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, మల్లేశం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

## - కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గంలో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని నాంచారి మదూరు గ్రామానికి చెందిన గితకార్మికుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేసాగని ఈరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి మృతి చెందగా శుక్రవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు వారి కుటుంబానికి అందే విధంగా కృషి చేస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల పనిచేయాలని ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి శ్రీనివాస్, నాయకులు దీకొండ మధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క ధాడీ చేస్తే.... వంద ధాడులు చేస్తాం ఖబర్దార్...!

## - బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు



**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అనుచరులు రాళ్ళదాడి చేయడాన్ని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...మాజీ శాసనసభ్యుడిగా నీళ్ళ విషయంపై ప్రభుత్వాన్ని నిలదీస్తే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన అనుచరులైన కాంగ్రెస్ కార్యకర్తలతో సుంకే రవిశంకర్ ఇంటిపై రాళ్ల దాడి చేయించాడని అన్నారు. తెలంగాణ కోసం దీటైన వ్యక్తులతో పోరాడిన గడ్డ కరీంనగర్ అని ఇలాంటి దాడులకు బిఆర్ఎస్ బయపడదని కాంగ్రెస్ ఒక దాడి చేస్తే బిఆర్ఎస్ వంద దాడులు చేస్తుందని కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిని నాశనం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు.మీకు దమ్ము ధైర్యం ఉంటే మాజీ ఎమ్మెల్యే అడిగినా ప్రశ్నకు జవాబు చెప్పాలని లేదంటే మూసుకొని కూర్చోవాలని, రైతుల గురించి ప్రశ్నిస్తే రాళ్లతో కొడతామంటే దీటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని బిఆర్ఎస్ నాయకులు తలుచుకుంటే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కరీంనగర్ జిల్లాలో బయటకు అడుగుపెట్టడని ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులను జివి రామకృష్ణారావు హెచ్చరించారు.

# అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**ముత్తారం.జనవరి.17.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంపల్లి మానేరు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మంథనికి ఇసుకను తరలిస్తున్న టిఎస్02 ఈక్యు 2166 నెంబర్ గల ట్రాక్టర్ ను పట్టుకొని ట్రాక్టర్ యాజమాని,డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు. మండలంలో ముత్తారం, అడవిశ్రీరాంపూర్ గ్రామాల్లోని రెండు ఇసుక రీచ్ లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు.ఈ రెండు ఇసుక రిచ్ ల నుండి కాకుండా ఇతర ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

# జన హృదయ నేతకు జన్మదిన వేడుకలు

## - తొర్రూర్‌లో ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు.

## - క్యూ న్యూస్ రిపోర్టర్ వేర్పుల మహేష్ తీన్మార్ మల్లన్న టీం పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి గాడి పెల్లి యాకన్న







**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ పట్టణంలో శుక్రవారం రోజు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తీన్మార్ మల్లన్న టీం పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి గాడి పెల్లి యాకన్న మరియు క్యూ న్యూస్ శనార్తి తెలంగాణ రిపోర్టర్ వేర్పుల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా తొర్రూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, మరియు అత్యవసర చికిత్స కోసం వచ్చిన రోగులకు తీన్మార్ మల్లన్న పేరు మీద పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మీడియా మిత్రులు, మరియు ఇతర ప్రముఖులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ గాడి పెల్లి యాకన్న మరియు క్యూ న్యూస్ రిపోర్టర్ వేర్పుల మహేష్ మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటారని, ప్రజలకు ధైర్యం ఇచ్చే శక్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల అధ్యక్షుడు మద్దెల సురేష్, పెద్దవంగర మండల అధ్యక్షుడు గరిగంటి నవీన్, రాయపర్తి మండల అధ్యక్షుడు చెడిపాక సందీప్, రాయపర్తి మండల ఉపాధ్యక్షుడు చెడిపాక గణేష్, పాలకుర్తి మండల ప్రధాన కార్యదర్శి చిలుకాని మహేందర్, తీన్మార్ మల్లన్న టీం పాలకుర్తి నియోజకవర్గం మహిళ విభాగం అధ్యక్షురాలు గుంటుక నవ్య ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు, స్థానిక నాయకులు, తీన్మార్ మల్లన్న అభిమానులు, మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి
- సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సమైకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పనిచేసే ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కార్యాలయాల నిర్వహణ సరిగ్గా లేవని, టాయిలెట్స్ మెయింటెనెన్స్ మరింత మెరుగ్గా ఉండాలని అన్నారు. మన కార్యాలయాలో విధులు నిర్వహించే సిబ్బంది డైనింగ్ హాల్ వద్ద లంచ్ చేయాలని, ఆ డైనింగ్ హాల్ ను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యాలయ రికార్డులు సరిగ్గా పెట్టుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని అన్నారు. మన కార్యాలయంలో అనవసరమైన రికార్డులు, చాలా పాతకాలం నాటి ఫర్నిచర్ ను తొలగించాలని అన్నారు. మన కార్యాలయాల్లో పాత పాడైపోయిన బీరువాలు అధికంగా ఉండటం వల్ల ఎక్కువ ప్లేస్ వాటికి పోతుందని, వాటి స్థానంలో నూతన ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే మనకు స్పేస్ దొరుకుతుందని అన్నారు. రాబోయే నాలుగు రోజులలో కార్యాలయంలోని స్టాఫ్ వినియోగించుకుని ప్రతి కార్యాలయం శుభ్రం చేసుకోవాలని అన్నారు. మన కార్యాలయంలో ఒక ఫైల్ ఎక్కడ ఉంది అంటే వెంటనే తీసే విధంగా సర్దుకోవాలని, గజి బిజిగా ఫైల్స్ పెట్టడం వల్ల అత్యవసర సమయాలో దొరకడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఆఫీస్ పారిశుధ్య నిర్వహణ పట్ల బాధ్యతగా ఉండాలని, తమ కార్యాలయంతో పాటు కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఫ్లోర్ వద్ద అదనంగా మరో మూడు పైప్ లైన్ ఔట్ లెట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మన కార్యాలయంలోని పాత పాడైపోయిన ప్రస్తుతం ఉపయోగంలో లేని ప్రింటర్లు సామాన్లను వెంటనే డిస్పోస్ చేయాలని అన్నారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని, కార్యాలయ డ్యూటీ సమయంలో క్షేత్రస్థాయి తనిఖీలకు వెళితే రికార్డులలో ఆ వివరాలు నమోదు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతిశీల మహిళా సంఘం ఐక్యత సభను జయప్రదం చేయండి..

- రాష్ట్రస్థాయి ప్రగతిశీల మహిళా సంఘం ఐక్యత సభ వాల్ పోస్టర్స్ ఆవిష్కరన...
- రెండు ప్రగతిశీల మహిళా సంఘాలు రాష్ట్రస్థాయిలో ఐక్యం...
- ప్రధాన వక్త గా ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే.. - పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి ఊకె పద్మ..



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి17(ది క్రైమ్ న్యూస్):-** మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సమానత్వం లక్ష్యంగా అభ్యుదయ మహిళా సంఘం పి ఓడబ్ల్యు పనిచేస్తుందని జిల్లా కార్యదర్శి ఊకె పద్మ అన్నారు. స్థానిక స్థానిక మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి ప్రగతిశీల మహిళా సంఘం ఐక్యత సభ వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై హింసకు వేధింపులకు అశ్లీల, అసభ్య సంస్కృతికి, సాహిత్యానికి, వరకట్న వేధింపులు, అత్యాచారలకు వ్యతిరేకంగా పోరాడే మహిళా సంఘాలు అవసరమని గుర్తించి బావ సారూప్యత గల మహిళా సంస్థలన్నీ ఒక తాటి మీదికి రావాలని అభిప్రాయం బలంగా వ్యక్తం అయింది. ఈ స్ఫూర్తితోనే 2024 జూన్ 22 పి ఓ డబ్ల్యు అర్ధవార్షిక సభను నిర్వహించుకున్నాము. అదే స్ఫూర్తితో రెండు ప్రగతిశీల మహిళా సంఘాలు రాష్ట్రస్థాయిలో 24.1. 25 మంచిర్యాలలో ఐక్యమవుతున్నాయి. కావున ఈ సభకు మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే హాజరవుతారని భవిష్యత్తు మహిళ పోరాటాలను కర్తవ్యాలను రూపొందిం చుకుంటారని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు గుజ్జు కృష్ణవేణి, కవిత సహాయ కార్యదర్శి పొన్నం రమ,చినం లక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు బట్టుబిన్నమ్మ శివారపు శారద, మంద పద్మ, గాడి పల్లి ప్రమీల, శారద అనూష తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరు బాధ్యతయుతంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- హెల్మెట్స్ పంపిణీ..- హెల్మెట్ తప్పక ధరించాలి..
- ముఖ్య అతిథిగా పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జనవరి.17(ది క్రైమ్ న్యూస్):** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తొర్రూర్ పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్ లో రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ మరియు రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యతయుతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. అనంతరం రవాణా శాఖ అధికారులు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవాలని, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం హెల్మెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామ చంద్రయ్య, తొర్రూర్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, డి టి ఓ జైపాల్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.సాయి చరణ్, మదర్ వాలంటరీ ఆర్గనైజేషన ప్రతినిధి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తీన్మార్ మల్లన్న పుట్టినరోజు వేడుకలు...



**జమ్మికుంట జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణంలో శనార్తి తెలంగాణ పత్రిక, క్యూ న్యూస్ అధినేత మరియు ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుట్టినరోజు సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు కొంగటి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. మల్లన్న ఎమ్మెల్సీ గా గెలిచాక చేస్తున్న మొదటి పుట్టినరోజు కావడం వలన మల్లన్న టీం సంబరంగా జరుపుకున్నారు. అటు హుజురాబాద్ నియోజకవర్గ టీం ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ స్పందన అనాథ ఆశ్రమంలోని పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి మల్లన్న పుట్టినరోజు వేడుకని జరిపి పిల్లలకు బ్రెడ్ మరియు స్వీట్లు పంపిణీ చేశారు. జమ్మికుంట లో కేక్ కట్టింగ్ కార్యక్రమం అనంతరం అధ్యక్షుడు రాజ్ కుమార్ మాట్లాడుతూ.. బహుజనుల అధికారం కోసం పాటుపడుతున్న మల్లన్న కోసం టీం ఎప్పుడూ వెన్నంటే ఉంటుందని, మల్లన్న ఆశయసాధనలే మా లక్ష్యంగా కదులుతాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మల్లన్న టీం జమ్మికుంట సోషల్ మీడియా ప్రతినిధి ముస్తఫా, వీణవంక మండల అధ్యక్షుడు రేగల్ల వినయ్ చందర్, ఇల్లందకుంట దేవరాజ్, నేదురు కుమార్, సాగర్, రమేష్, శ్రీనివాస్, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మీరు మర్చిపోయి కూడా లెమన్ వాటర్ తాగకండి..! అది మీ ఆరోగ్యానికి మేలు కంటే హాని చేస్తుంది!



లెమన్ వాటర్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దాని ఆరోగ్య ప్రయోజనాల కారణంగా మనలో చాలా మంది ఉదయం నిద్ర లేవగానే ఒక గ్లాస్ లెమన్ వాటర్ తాగడం అలవాటుగా చేసుకున్నారు. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ నీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే నిమ్మరసం తాగడం వల్ల కొంతమందికి హాని కలుగుతుందని మీకు తెలుసా? అవును, లెమన్ వాటర్ ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో అనేక సమస్యలు వస్తాయి ..కాబట్టి..ఎలాంటి వ్యక్తులు నిమ్మరసం తాగకూడదో ఇక్కడ తెలుసుకుందాం.. ఎసిడిటీ సమస్య ఉన్నవారు.. ఎసిడిటీ సమస్యలతో బాధపడేవారు లెమన్ వాటర్ ఎక్కువగా తీసుకోవడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెద్ద మొత్తంలో సిట్రిక్ యాసిడ్ ను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో ఆమ్లతను మరింత పెంచుతుంది. దీని కారణంగా మీరు ఇతర కడుపు సంబంధిత సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. దంత సమస్యలు ఉన్నవారు .. దంత సమస్యలు ఉన్నవారు లెమన్ వాటర్ తాగడం మానుకోవాలి. నిమ్మకాయల్లో ఉండే యాసిడ్ పంటి ఎనామిల్‌ను దెబ్బతీస్తుంది. ఇది దంతాలలో సున్నితత్వ సమస్యలను కలిగిస్తుంది. మీకు దంత సమస్యలు ఉంటే, దానిని తీసుకునే ముందు మీ దంతవైద్యుడిని సంప్రదించండి. ఎముక సంబంధిత సమస్యలు ఉన్నవారు .. ఎముక సంబంధిత సమస్యలతో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. నిమ్మరసం ఎక్కువగా తాగడం వల్ల మీ ఎముకలు దెబ్బతింటాయి. వాస్తవానికి, ఇందులోని యాసిడ్ కారణంగా, ఎముకలలో కాల్షియం తీవ్రమైన కోతను అనుభవిస్తుంది. ఇది మూత్రం ద్వారా విసర్జించబడుతుంది. దీని కారణంగా ఎముకలు బలహీనపడటం ప్రారంభిస్తాయి. లోపల నుండి బోలుగా మారతాయి. ఇది బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. కిడ్నీ సమస్యలు ఉన్నవారు.. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు నిమ్మరసం తాగకూడదు. ఇది మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడేవారు దీనిని పొరపాటున కూడా తీసుకోరాదు. హార్ట్ బర్న్ సమస్య.. హార్ట్ బర్న్ సమస్యతో బాధపడేవారు నిమ్మరసం తాగడం మానుకోవాలి. వాస్తవానికి, ఇది పెప్సిన్ అనే ఎంజైమ్‌ను సక్రియం చేస్తుంది. అంతే కాకుండా దీన్ని రోజూ తీసుకోవడం వల్ల పెప్టిక్ అల్సర్ సమస్య పెరుగుతుంది.


## ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం.. ఆకులు కూడా అమృతమే!

సీతాఫలాన్ని ఆంగ్లంలో "కస్టర్డ్ యాపిల్" అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు: సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. డయేరియా సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం: సీతాఫలం ఆకుల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది అధిక రక్తపోటు సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి పెరుగుతుంది. చర్మానికి మేలు చేస్తుంది: సీతాఫలం ఆకులు చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇందులోని విటమిన్ సి చర్మానికి పూర్తి పోషణను అందిస్తుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మానికి పోషణను అందిస్తాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దద్దుర్లు, మొటిమల వంటి చర్మ సమస్యల నుండి ఉపశమనం పొందుతాయి. క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: సీతాఫలం ఆకుల్లో క్యాన్సర్ నిరోధక శక్తి ఉందని చాలా అధ్యయనాలు కనుగొన్నాయి. సీతాఫలంలో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి మరియు విటమిన్ ఎ పోషకాలు క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడతాయి.

## పుట్టగొడుగులు తింటే యూరిక్ యాసిడ్ పెరుగుతుందా? ఎలాంటి కూరగాయలు తీసుకోవాలి?

ఎలివేటెడ్ యూరిక్ యాసిడ్ ఈ రోజుల్లో సాధారణ సమస్యలలో ఒకటిగా మారుతోంది. ఇది జీవక్రియ రుగ్మత, దీనిలో శరీరం ప్యూరిన్‌లను జీర్ణించుకోలేకపోతుంది. అవి ఎముకలలో పేరుకుపోవడం ప్రారంభిస్తాయి. ఇది చేతులు, కాళ్లు, మణికట్టు చుట్టూ పేరుకుపోతుంది. తరువాత గౌట్ సమస్యలను కలిగిస్తుంది. ఇలా శరీరంలో ప్యూరిన్స్ పెరగడం వల్ల ఎముకల్లో ఖాళీలు ఏర్పడి వాపులు వస్తాయి. దీంతో కీళ్లలో దృఢత్వం, నొప్పి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ప్యూరిన్ పెంచే ఆహారాలకు దూరంగా ఉండాలి. ఇంతకీ మష్రూమ్ తినడం వల్ల యూరిక్ యాసిడ్ పెరుగుతుందో లేదో తెలుసుకుందాం? పుట్టగొడుగులలో యూరిక్ యాసిడ్ పెంచడానికి పని చేసే ప్రొటీన్లు మంచి మొత్తంలో ఉంటాయి. ఇది మీ ఎముకలలో పెరగడం మొదలవుతుంది. వాపు పెరుగుతుంది. నిజానికి, మీరు పుట్టగొడుగులను తిన్నప్పుడు శరీరం వాటిని జీర్ణం చేస్తుంది. ప్యూరిన్లను విసర్జిస్తుంది. ఈ ప్యూరిన్ ఎముకలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. అడపాదడపా నొప్పిని కలిగించే సమస్యను సృష్టిస్తుంది. మీరు ప్రోటీన్ అధికంగా ఉండే ఇతర ఆహారాలను తిన్నప్పుడు ఈ నొప్పి తీవ్రమవుతుంది. అందుకే యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే లేదా మీకు గౌట్ సమస్య ఉంటే పుట్టగొడుగుల వినియోగాన్ని నివారించండి. మీ యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటే, మీరు పుట్టగొడుగులకు బదులుగా అధిక ఫైబర్ ఫుడ్స్ తినవచ్చు. వోట్స్, గంజి, నారింజ వంటి పండ్లు వంటివి. ఇది కాకుండా మీరు ఈ సమస్యలో చాలా ఉపయోగకరంగా ఉండే మొలకెత్తిన ధాన్యాలను కూడా తీసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నింటిలో మీరు పుట్టగొడుగులకు బదులుగా ఈ ఆహారాన్ని తినాలి. ఇది కాకుండా మీరు ఆకుకూరలు, పసుపు వంటి వాటిని తీసుకోవాలి. ఇది కాకుండా మీరు చియా గింజలను తినవచ్చు. గోరువెచ్చని నీరు తాగవచ్చు. ఈ పదార్థాలు యూరిక్ యాసిడ్ తగ్గించడంలో కూడా సహాయపడతాయి.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**ముత్తారం.జనవరి.17.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్, లక్కారం విద్యుత్ ఉప కేంద్రములో మరమ్మత్తుల దృష్ట్యా మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేయ బడుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని కోరారు.

# గుడుంబా నిర్మూలనకు కృషి

## - ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్ చేపడుతాం - ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాను గుడుంబా రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి. అంజన్ రావు తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్, తొర్రూరు ఇంచార్జ్ రాజేశుని ప్రవీణ్ తో కలిసి డిప్యూటీ కమిషనర్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు గుడుంబా నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్మెంట్ విభాగాలను సమన్వయం చేసుకొని ఫిబ్రవరి 15 వరకు ప్రత్యేక బృందాలతో డ్రైవ్ కొనసాగనుందని వెల్లడించారు. సిబ్బంది అంకితభావంతో, నిబద్ధతతో విధులు నిర్వహించి సారా నియంత్రణ లో మంచి ఫలితాలు తీసుకురావాలని ఆదేశించారు. సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడిపదార్థాల క్రయ, విక్రయాలు, రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా తయారీ కేంద్రాలు ఎక్కడున్నాయో క్షేత్ర స్థాయిలో ప్రత్యేక సమాచారాన్ని సేకరించి దాడులు చేస్తామన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జ్షీట్ దాఖలు వరకు సీజర్ రిపోర్టు, అరెస్ట్, కేసు ప్రాపర్టీ వంటి అంశాలు చట్ట ప్రకారం జరగుతాయన్నారు. గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో దాడులు నిర్వహించడంతోపాటు దానివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామీణ ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. గుడుంబా తయారు చేసి అమ్మేవారు, గతంలో కేసుల్లో ఉన్నవారు, అనుమానం ఉన్న వారిని కూడా బైండోవర్ చేస్తామన్నారు. గత సంవత్సరం 495 మందిపై కేసు నమోదు చేశామని, 33 టన్నుల నల్ల బెల్లం పట్టుకున్నామని, 107 వాహనాలను సీజ్ చేశామని, 283 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడుంబా ఆనవాళ్లు లేకుండా చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐలు ఎం.రవళి రెడ్డి, ఎన్.శంకర్, తిరుపతి, బి.మధు, సిబ్బంది పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి





**బెజ్జంకి (ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. చీలాపూర్ పల్లె, చీలాపూర్, గుండారం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు, బెజ్జంకి, పోతారం గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు భూమి పూజ, కల్లేపల్లిలో అంబేద్కర్ మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ....నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని అందులో భాగంగానే మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు,అంగన్వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టామన్నారు.అన్ని మండల కేంద్రాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలను అందిస్తున్నామని గుర్తుచేశారు. క్యాంటీన్లలో తయారు చేసే ఆహార పదార్థాలు, పచ్చళ్లు వంటి ఉత్పత్తులు శుభ్రతతోపాటు నాణ్యతను పాటిస్తే కస్టమర్ల విశ్వాసాన్ని సంపాదించవచ్చని, తద్వారా వ్యాపార అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.అనంతరం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఎఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, అలాగే పోతారం, చీలాపూర్ పల్లి, చీలాపూర్, గుండారం, బెజ్జంకి గ్రామాల పార్టీ అధ్యక్షులు కె. బాబు, కోటి, పి. ఉమేష్, పి. పోచయ్య, బి. రాజు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్యకు పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలి




**ఎండపల్లి, జనవరి 17(ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు ఇటీవల చత్తిష్ ఘడ్ రాష్టం బీజాపూర్ లో జరిగిన బస్తర్ జంక్షన్ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్యను కండిస్తూ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రజ సంఘాల నాయకులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం గొప్పదని చెప్పుకోవడం తప్ప పవిత్ర భారత దేశంలో ప్రశ్నించడమే నేరమైన తరుణంలో ప్రజల పక్షాణ ప్రజా స్వామ్యంలో పత్రికలు తమ పాత్ర తాము నిర్వహిస్తుంటే ఓర్వలేని గుతే దారులు మాఫియా మూటాలు పాత్రికేయులపై కక్ష సాదింపు దోరణి అవలంబిస్తున్నారని, ప్రజా స్వామ్యంలో పాత్రికేయులు నిజాలను నిర్బయంగా వార్తలు వ్రాస్తున్న జర్నలిస్ట్ లను కట్టుదిట్టం చేయడంతో పాటు నిజాలు బాహ్య ప్రపంచానికి తెలియజేయడమె వారి తప్పు అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో పాత్రికేయులపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన, ధాడులకు పాల్పడ్డ యూనియన్ పరంగా అడ్డుకోవడంతో పాటు పలు రకాల ఆందోళనలు నిర్వహించి పాత్రికేయులకు మద్దతుగా కలసి పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రైతు సమస్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లన్న, తెలంగాణ రైతు సమస్య సాధన సమితి నాయకులు ఎరుకల రాజన్న, టీ పి జాక్ రాష్ట్ర కమిటీ మెంబర్ పొన్నం రాజ మల్లయ్య ,రైతు సమితి పెద్దపల్లి జిల్లా కమిటీ మెంబర్ గొట్టే లింగన్న, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ ధర్మారం మండల అధ్యక్షుడు ముదాం శ్రావణ్ కుమార్, డీజే ఎఫ్ యూనియన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గౌరీ ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి బండి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోడేటి మల్లేశం గౌడ్, డీజేఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పరకాల మనోజ్, కార్యవర్గ సభ్యులు వైద్య సతీష్, కుమ్మరి సురేష్, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# నరసింహా స్వామి ఆలయ అభివృద్ధికి పాటుపడతా

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**బెజ్జంకి (ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ....ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందడానికి అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని,నూతన ధర్మకర్తల మండలి, ఆలయ అభివృద్ధి కోసం విశేష కృషి చేసి, ఆదర్శంగా నిలవాలనీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దాతల సహకారంతో ధర్మకర్తలు, ఆలయ అధికారులు, సిబ్బంది, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని,ఆలయ విశిష్టత, సంప్రదాయాలను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ధర్మకర్తల మండలి ముందుండాలని సూచించారు.ఈ సందర్భంగా నూతన ధర్మకర్తల మండలి సభ్యులు జెల్ల ప్రభాకర్ ఆలయ చైర్మన్గా ప్రమాణం చేయగా, ధర్మకర్తలుగా బర్ల రాజయ్య, బెజుగం విశ్వప్రసాద్, గుబిరె చంద్రయ్య, దోనె శ్యాం, ఐయలేని జయ, బోనగిరి ప్రభాకర్ (పొట్లపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు.కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవ్ ఆర్య, డిపిఎం కరుణాకర్, ఏపీఎం నరసయ్య, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, ఈవో విశ్వనాధ్ శర్మ, ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ నాయకులు సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, శీలం నర్సయ్య, కె. బాబు, కోటి, పి. ఉమేష్, పి. పోచయ్య, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను అందజేసిన వైరా పోలీసులు..

## - సి ఈ ఐ ఆర్ యాప్ ద్వారా ట్రాక్..




**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్):** ఖమ్మం జిల్లా లో ది క్రైమ్ న్యూస్ దినపత్రిక లో జర్నలిస్టుగా పనిచేస్తున్న నందిగామ మనోహర్ అనే వ్యక్తికి చెందిన సెల్ ఫోన్ పోగొట్టుకోవడంతో వైరా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.. దీంతో వైరా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సి ఈ ఐ ఆర్ యాప్ సహాయంతో ట్రాక్ చేసి మూడు రోజులు వ్యవధిలోనే సెల్ ఫోను ఫిర్యాదుదారుడు నందిగామ మనోహర్ కు అందజేశారు.. హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జలీల్, కానిస్టేబుల్ మాతంగి విజయ్ లు సెల్ ఫోన్ ను తిరిగి ఫిర్యాదుదారునికి అందజేశారు.. పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను తిరిగి భద్రంగా అందించిన వైరా పోలీస్ అధికారులకు సిబ్బందికి నందిగామ మనోహర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. పోలీసుల పనితీరుపై వైరా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఈ నెల 22,23న అన్ని జిపిలలో గ్రామ సభలు..



**ముత్తారం.జనవరి.17.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 22,23 న ఇందిరమ్మ ఇల్లు,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల వంటి ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఆమోదంకై గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న లక్కారం, దర్యాపూర్, ఓడేడు, సీతంపేట, 23న ముత్తారం, అడవిశ్రీరాంపూర్, పారుపల్లి, కేశనపల్లి, మచ్చుపేట, మైదంబండ, పోతారం, హరిపురం, ఖమ్మంపల్లి, జిల్లలపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ సభలో అర్హుల జాబితాను ఆమోదించడం జరుగుతుందని తెలిపాడు.గ్రామ ప్రజలు సకాలంలో గ్రామసభలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్ కోరారు.

# ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు రైతు భరోసా అభివృద్ధి పథకాలపై, విలేజీలు సమీక్ష


## - పరిశీలించిన ఐఏఎస్ శశాంక, జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు





**శామీర్‌పేట, జనవరి 17 (ది క్రైమ్ న్యూస్):** ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు రైతు భరోసా అభివృద్ధి పథకాలపై, ప్రక్రియను ప్రభుత్వం ద్వారా నియమితులైన స్పెషల్ ఆఫీసర్ ఐఏఎస్ శశాంక, జిల్లా కలెక్టర్ గౌతం పోట్రుతో కలిసి పరిశీలించారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ 3వ వార్డులో అధికారులు చేపడుతున్న సర్వేను పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని మున్సిపాలిటీ అధికారులకు సూచించారు. వీరితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్, మేనేజర్ శ్రవణ్ కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జూబ్లీ బస్ స్టేషన్ నుండి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్ భూ సేకరణపై సంబంధిత అధికారులనువివరాలు అడిగి తెలుసుకున్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం... 17సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు



**కరీంనగర్ టౌన్, జనవరి17(ది క్రైమ్ న్యూస్):** ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని పూర్వ విద్యార్థి, 17సంవత్సరాల కిందట 2007-08 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శుక్రవారం కొక్కరకుంటలో ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వాళ్లందరూ వచ్చి ఒకరికొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మహేష్ సినిమాలో ప్రియాంకా చోప్రా

**అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రియాంకా**

పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని తెలిసిందే. ఈ భామ రీఎంట్రీకి రెడీ అయినట్టు ఇప్పటికే వార్తలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ బ్యూటీ ఫైనల్‌గా ఎస్‌ఎస్‌ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో ప్రియాంకా చోప్రా గురువారం సాయంత్రం టొరంటో నుంచి హైదరాబాద్‌లో ల్యాండైంది. దీనికికారణం మహేశ్ బాబు చేయబోతున్న కొత్త సినిమానేనట. ప్రియాంకా చోప్రా ఆర్‌ఆర్‌ఆర్ డైరెక్టర్ ఎస్‌ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్‌ఎస్‌ఎంబీ 29 అనౌన్స్‌మెంట్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిందని నెట్టింట కథనాలు రౌండప్ చేస్తున్నాయి. ఇదే నిజమైతే ఐదేళ్ల తర్వాత ప్రియాంకా చోప్రా చేయబోతున్న భారతీయ సినిమా ఎస్‌ఎస్‌ఎంబీ 29 కానుంది. మరి దీనిపై కొన్ని గంటల్లో క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు.




## ఎమర్జెన్సీకి అవార్డు పక్కా

బాలీవుడ్‌లో ఉన్న సెల్ఫ్‌మేడ్ లేడీ యాక్టర్లలో టాప్‌లో ఉంటుంది కంగనారనౌత్. గ్లామరస్ పాత్రలతోపాటు పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ సినిమాలతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. చాలా కాలంగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న ఈ యాక్టర్ కమ్ పొలిటిషియన్ తాజాగా ఎమర్జెన్సీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రాన్ని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాలనలో 1975 జూన్ 25 నుండి 1977 వరకు కొనసాగిన ఇండియన్ ఎమర్జెన్సీ ఆధారంగా తెరకెక్కించారు. ఎమర్జెన్సీ సమయంలో పౌరహక్కుల సస్పెన్షన్, ఇందిరా గాంధీ వ్యతిరేకుల అరెస్టుతోపాటు పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిసిందే. ఎమర్జెన్సీ టైంలో ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నిలబడ్డ ప్రముఖ రాజకీయ వేత్త జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పాత్రలో పాపులర్ బాలీవుడ్ దర్శకనిర్మాత అనుపమ్ ఖేర్ నటించగా.. అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే, భూమికా చావ్లా ఇతర కీలక పాత్రలు పోషించారు. పొలిటికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కంగనారనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటించింది. నేడు (జనవరి 17న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. ఓ వైపు లీడ్ రోల్‌లో నటిస్తూనే.. మరోవైపు డైరెక్టర్‌గా మెగాఫోన్ పట్టింది. మరి కంగన రనౌత్ ఎమర్జెన్సీ గురించి నెట్టింట టాక్ ఎలా ఉందో తెలుసుకుందాం.

## లోకల్ చానల్‌లో గేమ్‌ఛేంజర్

రాంచరణ్ నటించిన గేమ్ ఛేంజర్ విడుదల రోజే పైరసీ విషయంలో చిత్రయూనిట్‌కు బెదిరింపులు వచ్చాయని తెలిసిందే. పలు చోట్ల ఆన్‌లైన్‌లో సినిమా ప్రింట్ షేరింగ్స్ కూడా జరిగాయి. పైరసీ కావడంపై మూవీ టీం సైబర్ క్రైమ్ విభాగాన్ని కూడా ఆశ్రయించింది. విడుదల రోజే పైరసీ రావడంపై గేమ్ ఛేంజర్ టీం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా గేమ్ ఛేంజర్ ఏకంగా లోకల్ టీవీ ఛానెల్‌లో ప్రసారం కావడం గేమ్ ఛేంజర్ టీంను ఆందోళనకు గురి చేసింది. ఈ సినిమా వచ్చి వారం కూడా కాకుండానే లోకల్ ఛానల్‌లో ప్రసారం అయ్యింది. దీనికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో షేర్ కూడా చేశారు నెటిజన్లు. ఏపీలోని కాకినాడ ప్రాంతంలో సినిమాను లోకల్ ఛానెల్‌లో ప్రసారం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో అప్పలరాజు అనే వ్యక్తిని గాజువాకలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే టాలీవుడ్ నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కేఎన్) ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఒక సినిమా వెనక కొన్ని వేల మంది శ్రమ దాగి ఉంటుందని తెలిపారు. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఒక సినిమా విడుదలై 4 నుంచి 5 రోజులు కాకుండానే లోకల్ కేబుల్ ఛానల్‌తో పాటు బస్సుల్లో ప్రసారం చేస్తున్నారు. ఈ విషయం తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. సినిమా అంటే కేవలం దర్శకుడు, హీరో, నిర్మాతలే కాదు. ఇది నాలుగేండ్ల కృషి. ఇలా ఆన్‌లైన్ పైరసీ చేస్తున్నప్పుడు సినిమా విజయంపై ఆధారపడి జీవిస్తున్న డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల గురించి ఆలోచించండి. ఇలా చేయడం వలన చిత్ర పరిశ్రమ భవిష్యత్తుకు కూడా ముప్పు ఉంటుంది. ఈ చర్యలపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకునే టైం వచ్చిందంటూ ట్వీట్ చేశాడు.





## పుష్పరాజ్‌కు చైన్ ఇచ్చిన అన్నయ్య

### 20 నిమిషాల నిడివిని యాడ్ చేసిన సినిమా బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.2000 కోట్ల దిశగా దూసుకెళుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి రీలోడెడ్ వెర్షన్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో విడుదలకు ముందు డిలీట్ చేసిన 20 నిమిషాలను మేకర్స్ శుక్రవారం యాడ్ చేశారు. ముందుగా జనవరి 11న యాడ్ చేద్దామనుకున్నా అనుకోని కారణాల వలన జనవరి 17కి వాయిదా వేసింది. తాజాగా 20 నిమిషాల డిలీటెడ్ సీన్స్ థియేటర్ వెర్షన్‌లో కలిపింది. అయితే ఈ సీన్స్‌లో ఒక హైలెట్ సీన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ సీన్ ఎంటంటే.. పుష్ప పార్ట్ 1లో.. పుష్ప రాజ్(అల్లు అర్జున్) మెడలో ఉన్న లాకెట్‌ను అతడి అన్నయ్య (అజయ్) కోపంతో తీసుకోని వెళతాడు. అయితే అదే చైన్‌ను తీసుకువచ్చి పార్ట్ 2 క్లైమాక్స్‌లో పుష్పరాజ్ మెడలో వేస్తాడు అజయ్. ఈ సన్నివేశాన్ని విడుదల ముందు కట్ చేశారు మేకర్స్. మరోవైపు సుకుమార్ ఈ విషయం ఎలా మార్చిపోయాడు అంటూ విడుదల తర్వాత దీనిపై చర్చ కూడా జరిగింది. అయితే కొత్తగా యాడ్ చేసిన వాటిలో ఈ సీన్ కూడా ఉండడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు.



## చేప పులుసును వండిన నాగచైతన్య

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం తండేల్. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ సినిమా ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా నాగచైతన్య షూట్ లొకేషన్‌లో చేపలపులుసు వండిన వీడియోను షేర్ చేశారు మేకర్స్. అన్నా ఇంతకుముందు నాగచైతన్యను కలిసిన కదా.. అప్పుడు మా అంత బాగా ఆయన చేత్తోనే చేపల పులుసు వండుతనని మాటిచ్చినడు. ఆ మాటెంతవరకు కరెక్ట్ అవుతుందో చూడటానికి మేం వెళ్లాం. అచ్చం మాలాగే కట్టెల పొయ్యిపై రుచికరమైన చేపల పులుసు వండాడంటూ ఓ స్థానిక వ్యక్తి సంభాషణలతో సాగుతుంది వీడియో. షూటింగ్ టైంలో చైతూ వండిన చేపల పులుసు తిన్న స్థానికులు సూపర్‌గా ఉందంటూ కితాబిచ్చారు. యేటలో చేపలు పట్టేసాక..మంచి పులుసు ఎట్టేయాలి కదా అంటూ సాగుతున్న మేకింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. టాప్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.




## అభిమానులను థ్రిల్ చేస్తున్న హరిహరవీరమల్లు పాట

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ హరిహరవీరమల్లు. జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ రెండు పార్టులుగా రానుండగా.. హరిహరవీరమల్లు పార్ట్ 1 మార్చి 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఫస్టి సింగిల్ వినాలి.. వీరమల్లు మాట వినాలి ప్రోమో కూడా విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ లాంచ్ చేశారు. ఏం గుల్పామ్ ఏం గురాయించి చూస్తున్నవ్ భయపెట్టనీకా..? ఓహో చాలా మందిని చూసినాంలే బిడ్డా. హే మునిమాణిక్యం చూసినవా.. గురాయించి చూస్తుండు బేటా.. మన లెక్క తెల్వదు.. వినాలి.. వీరమల్లు మాట చెబితే వినాలి.. అంటూ తెలంగాణ యాసలో పవన్ కల్యాణ్ స్టైల్‌లో సాగుతున్న లిరిక్స్ ఆకట్టుకుంటూ.. అభిమానులను థ్రిల్ చేస్తున్నాయి. పెంచల్ దాస్ రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజిషన్‌లో పవన్ కల్యాణ్ పాడాడు. ఈ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత అనుపమ్ ఖేర్, అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. క్లైమాక్స్‌లో వచ్చే రెడ్ డ్రెస్ ఫైట్‌ను 42 రోజులపాటు చిత్రీకరించారని ఇన్‌సైడ్ టాక్.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com